RNI NO. TELTEL/2022/83470

manasakshi.in

# మనసాక్షి

మీకోసం

తెలుగు దినపత్రిక

ఎడిటర్ : మల్లె నాగిరెడ్డి



లంచాలకు మరిగిన అధికారులు 2లో



థియేటర్ల మూసివేత వ్యక్తిగత నిర్ణయం 2లో

నల్గొండ | హైదరాబాద్ | సంపుటి : 2. సంచిక :235 | శుక్రవారం 17 మే 2024 | పేజీలు 8 | వెల: రూ.1.00 | epaper.manasakshi.in



## హైదరాబాద్ వ్యాప్తంగా భారీ వర్షం

అకాల వర్షాలు మరోసారి రాష్ట్రాన్ని అతలాకుతలం చేశాయి. గురువారం సాయంత్రం 4 గంటల సమయంలో ఒక్కసారిగా విరుచుకుపడిన వాన రైతులు, సామాన్యులను ఆగం చేసింది. అబ్దుల్లాపూర్‌మెట్ నుంచి పటాన్‌చెరు వరకు.. పాతబస్తీ నుంచి మాదాపూర్ దాకా..



## రాష్ట్రవ్యాప్తంగానూ కుంభవృష్టి

# హడలెత్తించిన హఠాత్తు వాన

### రోడ్లు జలమయమయ్యాయి.

- భారీ వర్షంలో పొంగిన నాలాలు
- పలు చోట్ల కొట్టుకు పోయిన వాహనాలు
- వరదనీరు చేరడంతో పలుచోట్ల తీవ్ర ఇక్కట్లు
- రాజధానిలో ఉప్పొంగిన నాలాలు, కొట్టుకుపోయిన వాహనాలు
- నల్గొండ జిల్లా కనగల్‌లో అత్యధికంగా 10.2 సెం.మీ. వర్షపాతం

హైదరాబాద్,మనసాక్షి

హైదరాబాద్ వ్యాప్తంగా గురువారం భారీ వర్షం కురిసింది. పలుప్రాంతాల్లో రోడ్లపై వరదనీరు నిలవగా.. అనేక చోట్ల ట్రాఫిక్‌జామ్ అయింది. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. నాలాలు పొంగడంతో వాహనాలు కొట్టుకు పోయాయి. పలు ప్రాంతాల్లో మూసీ నాలాలు పొగాయిన జిహెచ్ఎంసి అత్యవసర బృందాలు రంగంలోకి దిగాయి. మాదాపూర్, గచ్చిబౌలి, తదితర ప్రాంతాల్లో కార్యాలయాల నుంచి ఐటీ ఉద్యోగులంతా ఒకేసారి రావడంతో ట్రాఫిక్ భారీగా స్తంభించిపోయింది. రోడ్లపై పలుచోట్ల మోకాలి లోతు వరకు నీరు చేరడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. సైబర్ టవర్స్ వద్ద వరదనీరు చేరడంతో ప్రయాణికులు ఇబ్బందులు పడ్డారు. మాదాపూర్ నుంచి కేపీహెచ్‌బీ వైపు వెళ్లే మార్గంలో ట్రాఫిక్ స్తంభించగా.. మైండ్ స్పేస్ నుంచి ఐకియా మార్గంలో వాహనాలు మెల్లగా కదిలాయి. మాదాపూర్ నెక్టార్ శిల్పారామం సైబర్ గేట్‌వే రోడ్లపై వరదనీరు చేరింది. మలక్‌పేట రైల్వే బ్రిడ్జి కింద

మిగతా 2లో



# రైతు సమస్యలపై బిఆర్ఎస్ ఆందోళన

## రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు.. ధర్నాలు

ధాన్యం కొనుగోళ్లు, బోనస్ చెల్లింపులు, మద్దతు ధరలు, రుణమాఫీ తదితర అంశాల్లో బిఆర్ఎస్ అధినేత కెసిఆర్ పిలుపు మేరకు రాష్ట్రవ్యాప్తంగా బిఆర్ఎస్ నేతలు ఆందోళనలకు దిగారు.

2లో

"హైదరాబాద్ సహా రాష్ట్రంలో అన్ని చోట్ల భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, కానీ అదే స్థాయిలో రెవెన్యూ రాబడుల్లో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం పెరగలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు."



# భూముల ధరలు సవరించాలి

- మార్కెట్ విలువకు, క్రయ విక్రయ ధరలకు పొంతన లేదు
- రాష్ట్ర ఆదాయం పెంచేందుకు సమన్వయంతో పని చేయండి
- పన్ను ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించొద్దు
- సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్,మనసాక్షి

హైదరాబాద్ సహా రాష్ట్రంలో అన్ని చోట్ల భూములు, స్థిరాస్తుల రేట్లు భారీగా పెరిగాయని, కానీ అదే స్థాయిలో రెవెన్యూ రాబడుల్లో రిజిస్ట్రేషన్లు, స్టాంపుల ద్వారా వచ్చే ఆదాయం మాత్రం పెరగలేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. చాలా చోట్ల భూముల మార్కెట్ విలువకు, వాస్తవ క్రయ, విక్రయ రేట్లకు పొంతన లేకపోవటం ప్రధాన కారణమని ఆయన అభిప్రాయపడ్డారు. గురువారం సచివాలయంలో ఆయన రాష్ట్రానికి ప్రధానంగా ఆదాయం తెచ్చిపెట్టే వాణిజ్య పన్నులు, స్టాంపులు, రిజిస్ట్రేషన్లు, ఎక్సైజ్, మైనింగ్ విభాగాల ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, జూపల్లి కృష్ణారావు పాల్గొన్నారు. "గత ప్రభుత్వం 2021లో భూముల విలువను, రిజిస్ట్రేషన్ ఛార్జీలను పెంచింది. ఇప్పటికీ చాలాచోట్ల భూముల మార్కెట్ విలువకు, క్రయవిక్రయ ధరలకు మధ్య భారీ తేడా ఉంది. నిబంధనల ప్రకారం ఏడాదికోసారి మార్కెట్ విలువను

మిగతా 2లో

# విద్యార్థినిపై యాసిడ్ దాడి

## శంకర్‌పల్లి ఇక్ఫాయ్ యూనివర్సిటీలో దారుణం

శంకర్‌పల్లి: మే 16: (మన సాక్షి):



శంకర్పల్లి మండల పరిధిలోని దొంతాన్ పల్లి గ్రామ శివారులో గల ఇక్ఫాయ్ యూనివర్సిటీలో గురువారం దారుణం చోటుచేసుకుంది. లేఖ అనే విద్యార్థిని పై.. తోటి విద్యార్థులే యాసిడ్ దాడికి పాల్పడ్డారు. కాలేజీ మైదానంలో, గేటు బయటో, ఎవరూ లేని సమయంలో క్లాస్ రూమ్ లో అనుకుంటే పొరపాటే. ఏకంగాకాలేజీలో జరుగుతున్న వేడుకలో ఈ దాడికి పాల్పడ్డారు.అయితే కొందరు విద్యార్థులు రంగు నీళ్లకు బదులు బకెట్ లో యాసిడ్ నింపారు. రంగు నీళ్లే అనుకొని విద్యార్థులు తోటి విద్యార్థిని లేఖపై యాసిడ్ పోశారు.దీంతో లేఖకు తీవ్ర గాయాలు అయ్యారు. వెంటనే స్పందించిన కాలేజీ యాజమాన్యం ఆమెను హైదరాబాద్ దిల్ సుక్ నగర్ కొత్తపేటలోని ఓమిని ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం 40 శాతం మేర శరీరంపై గాయాలు అయినట్లు సమాచారం. ఆమెకు చికిత్స కొనసాగుతోంది. దాడికి సంబంధించిన పూర్తి వివరాలుతెలియాల్సి ఉంది. విషయం తెలిసిన వెంటనే ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకొనిదర్యాప్తు ప్రారంభించారు.

# కవిత బెయిల్ పిటిషన్‌పై విచారణ 24కి వాయిదా



దిల్లీ,మనసాక్షి: దిల్లీ మద్యం కేసులో అరెస్టయి తిహాడ్ జైల్లో ఉన్న భారాస ఎమ్మెల్సీ కవిత.. బెయిల్ కోసం దాఖలుచేసిన పిటిషన్‌లో దిల్లీ హైకోర్టు సీబీఐకి నోటీసులు జారీచేసింది. గురువారం దీనిపై విచారణ చేపట్టిన జస్టిస్ స్వర్ణకాంతశర్మ ఈ నెల 24లోపు సమాధానం ఇవ్వాలని సీబీఐని నిర్దేశిస్తూ విచారణను ఆరోజుకి వాయిదావేశారు. ఈడీ కేసులో బెయిల్ కోసం కవిత గతంలోనే దాఖలుచేసిన పిటిషన్‌పై విచారణను కోర్టు 24కే వాయిదా వేసింది. ఆరోజు ఈడీ, సీబీఐ కేసుల బెయిల్ పిటిషన్లు రెండింటిపై ఒకేసారి విచారణ చేపట్టనుంది.



# కాంగ్రెస్ కలలు ఫలించేనా !

"అన్ని స్థాయుల పదవుల్లో ప్రస్తుతం ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ, మైనారిటీలకు ఇస్తున్న 20 శాతం ప్రాతినిధ్యాన్ని 50 శాతానికి పెంచాలని, ఉపకులాలకు కూడా అత్యధిక ప్రాధాన్యమివ్వాలని కాంగ్రెస్ తన లక్ష్యంగా పేర్కొంది. నిజానికి ఈ వర్గాలన్నీ తొలుత కాంగ్రెస్ వెన్నంటే ఉన్నాయి. కానీ ప్రకటలనకే పరిమితం అయిన వీరి పురోభివృద్ధి ఆచరణలో కానరాలేదు."

హైదరాబాద్,మనసాక్షి

కాంగ్రెస్ పార్టీలోఆత్మవిశ్వాసం పెరుగుతోంది. ఇండియా కూటమి విజయం సాధిస్తుందన్న ధీమాతో నేతలు ఉన్నారు. ఇండియా కూటమి నేతల్లో సైతం ఆత్మ విశ్వాసం పెరిగింది. కాంగ్రెస్ నేతలు కూడా ఇక ప్రభుత్వం తమదే అన్న ధీమాలో ఉన్నారు. ఎన్నికలు జరుగుతున్నాయి కనుక ప్రజలకు ఆ మాత్రం విశ్వాసం కల్పించాల్సిందే. లేకుంటే ప్రజలు కూడా నమ్మరు. ఇప్పటికే నాలుగు విడతల ఎన్నికలు ముగిశాయి. మరో మూడు విడుతల్లో ఎన్నికలతో జూన్ 1న పోలింగ్ ముగియనుంది. ప్రజలు కాంగ్రెస్‌ను ఏ మేరకు నమ్మారన్నది జూన్ 4న ఫలితాల్లో తేలనుంది. వారి విధానాలు ప్రజలకు చేరాయా...కాంగ్రెస్‌ను నమ్మవచ్చా లేదా అన్నది కూడా తేల్చనున్నారు. రాహుల్ గాంధీ వయనాడ్‌తో పాటు, రాయబరేలిలో పోటీ చేస్తున్నారు. అమేథీలో పోటీకి వెనుకంజ వేశారు.అలాగే వయనాడ్ ఎన్నిక ముగిసిన తరవాతనే రాయబరేలి ని ఎంచుకోవడం గమనించవచ్చు. ఎందుకంటే ఎక్కడో భయం వెన్నాడుతోంది. ఇంతకాలం తమకు బడుగుబలహీన వర్గాలు,మైనార్టీలు అండగా ఉన్నారని భావించినా గత రెండు ఎన్నికల్లో బొక్కబోర్లా పడ్డది. రాష్ట్రాల ఎన్నికల్లోనూ అదే పరాభవం ఎదురయ్యింది. ఈ క్రమంలో బిసి గణన, రిజర్వేషన్ల అంశం నెత్తికెత్తుకుంది. ఈ వర్గాలను నమ్మించడానికి ఇంతకన్నా వేరు మార్గం కాంగ్రెస్ ముందు లేదు. అలాగే దేశవ్యాప్తంగా మళ్లీ బలం పుంజుకోవడానికి, దూరమైన వర్గాలను దగ్గరకు చేర్చుకునేందుకు పాదయాత్రలు, ఆందోళనలకు శ్రీకారం చుట్టింది. ఈక్రమంలో కన్యాకుమారి నుంచి కశ్మీరు వరకు రాహుల్ పాదయాత్ర చేపట్టారు. నిరుద్యోగం, ధరల పెరుగుదల వంటి అంశాలపై పోరాటాలు ప్రారంభించారు. ప్రజల్లో ఈ అంశాలపై చర్చించారు. మొత్తంగా ఇంత కాలం ప్రజలకు దూరంగా ఉంటూ వచ్చిన కాంగ్రెస్ గత రెండేళ్లలో అనే కార్యక్రమాలు, ఆందోళనల ద్వారా ప్రజలకు చేరువ కావాలన్న సంకల్పంతో మళ్లీ అధికారం కోసం ఈ ఎన్నికల్లో పోరాడుతోంది. ఇండియా కూటమిలో అన్ని పార్టీలు మనస్ఫూర్తిగా చేరకున్నా..ఉన్న పార్టీలను కలుపుకుని పోవడం కొంత కలసివచ్చే అంశమే. అయితే ప్రజలు ఎందుకు దూరమ్యారో..వారిని ఎలా దరికి చేర్చుకోవాలో ఆత్మపరిశీలన కూడా అవసరమే. గత పదేళ్ల యూపిఎ హయాంలో జరిగిన పొరపాట్లను, కుంభకోణాలపై ప్రజలకు వివరణ ఇచ్చుకోవాల్సి ఉన్నా వాటికి జోలికి వెళ్లడం లేదు. స్వాతంత్ర్యం తామే తెచ్చామని, అభివృద్ధి అంతా తమ హయాంలోనే జరిగిందని గొప్పలు చెప్పుకోవడం మానాలి.

## మొదటి పేజి తరువాయి




## హడలెత్తించిన హఠాత్తు వాన

వరదనీరు భారీగా చేరింది. రైల్వే అండర్ పాస్ కింద నీరు చేరడంతో రాకపోకలు నిలిచాయి. దిల్‌సుఖ్‌నగర్ -కోఠి మార్గంలో వాహనాలు రాకపోకలు నెమ్మదిగా సాగుతున్నాయి. మలక్‌పేట రైల్వే బ్రిడ్జికి ఇరువైపులా భారీగా వాహనాలు నిలిచిపోయాయి. కోఠి, చాదర్‌ఘాట్, మలక్‌పేట ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. సాయంత్రం వర్షం తెరిపిచ్చినప్పటికీ.. రాత్రికి వడగళ్లతో వర్షం కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరించింది. నగరంలో భారీ వర్షం కురువడంతో వరదలతో హైదరాబాద్ రోడ్లు జలమయమయ్యాయి. బంజారాహిల్స్ రోడ్ నం.9లో నాలాపై రోడ్డు కుంగిపోయింది. దీంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఉదయ్‌నగర్‌లో నాలా పైకప్పు కూలింది. వరద నీటిలో పలు ద్విచక్రవాహనాలు కొట్టుకుపోయాయి. నాలా కూలిన ప్రాంతాల్ని మేయర్ విజయలక్ష్మి పరిశీలించారు. ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. మరోవైపు బల్కంపేట రైల్వే అండర్‌పాస్ కింద వరదనీటిలో కారు మునిగిపోయింది. రాత్రి వేళ పలు చోట్ల వడగళ్ల వాన పడుతుందని వాతావరణశాఖ హెచ్చరికలు జారీ చేసింది. తెలంగాణలో భారీ వర్షాలు పడుతున్న నేపథ్యంలో అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. వర్షం కురుస్తున్న ప్రాంతాల్లో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు ఇబ్బంది పడకుండా వెంటనే చర్యలు చేపట్టాలని ఆదేశించారు. జీహెచ్ఎంసీ ఇంజినీర్లతో కమిషనర్ రోనాల్డ్ రాస్ సమీక్ష నిర్వహించారు. వర్షాల నేపథ్యంలో ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని ఆదేశించారు. ఉద్యోగులు కార్యాలయాల నుంచి ఆలస్యంగా వెళ్లాలని కమిషనర్ సూచించారు. అత్యవసరం అయితేనే ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రావాలని చెప్పారు.



## లంచాలకు మరిగిన అధికారులు

**ఎసిబికి పట్టుబడ్డ అవినీతి చేపలు**

**హైదరాబాద్:** తెలంగాణలో వేర్వేరు చోట్ల ఒకేరోజు ముగ్గురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డారు. భద్రాద్రి జిల్లా అశ్వారావుపేట ట్రాన్స్‌కో ఏఈ శరత్‌కుమార్ రైతుకు ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేసేందుకు రూ.లక్ష లంచం అడిగాడు. ఆ మొత్తాన్ని తీసుకుంటుండగా అవినీతినిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. అలాగే, మెదక్ జిల్లా నర్సాపూర్ మండల వ్యవసాయశాఖ అధికారి అనిల్ కుమార్ ఏసీబీ వలకు చిక్కాడు. ఆగ్రో ఏజెన్సీ దుకాణం కోసం అనుమతికి రూ. 30వేలు లంచం తీసుకుంటుండగా అధికారులు అరెస్ట్ చేశారు. నల్గొండ జిల్లా చింతపల్లిలో విద్యుత్‌శాఖ ఉద్యోగి వేణు బోరుకు విద్యుత్ కనెక్షన్ ఇచ్చేందుకు రూ. 50వేలు డిమాండ్ చేశాడు. తొలి విడతగా రూ. 20వేలు లంచం తీసుకున్నాడు. సమాచారం అందుకున్న ఏసీబీ అధికారులు అతడిని పక్కా వ్యూహంతో పట్టుకున్నారు.

## థియేటర్ల మూసివేత వ్యక్తిగత నిర్ణయం

**ఐపిఎల్, ఎన్నికల కారణంగా ప్రేక్షకులు కరువు**

**తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి వెల్లడి**

**హైదరాబాద్:** ఓ అసోసియేషన్ తీసుకున్న నిర్ణయం వల్లే థియేటర్లలో ప్రస్తుతం సినిమాలు ప్రదర్శితం కావడం లేదని వస్తున్న వార్తలను టీఎఫ్‌పీసీ తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి ఖండించింది. అది థియేటర్ల యజమానుల వ్యక్తిగతమని పేర్కొంది. ఈమేరకు టీఎఫ్‌పీసీ సెక్రటరీ టి.ప్రసన్నకుమార్ ఓ ప్రకటన విడుదల చేశారు.'గుంటూరు సహా ఆంధ్రాలోని పలువురు సినిమా థియేటర్ల యజమానులు కొన్ని నెలలుగా తగిన ఆదాయం పొందలేకపోతున్నారని, దీంతో డిజిటల్ ప్రొవైడర్లకు ఛార్జీలు చెల్లించలేకపోతున్నారన్న కారణాన్ని చూపుతూ సినిమా ప్రదర్శనలు నిలిపివేసినట్టు మా దృష్టికి వచ్చింది. తెలంగాణలోనూ కొందరు థియేటర్ల యజమానులు.. ఆశించిన స్థాయిలో ప్రేక్షకులు రావడం లేదని ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. ఎన్నికలు, ఐపీఎల్ కారణంగా ఈ పరిస్థితి నెలకొంది. ఓ అసోసియేషన్ వల్లే థియేటర్లు మూతపడ్డాయంటూ వస్తున్న వార్తలను మేం ఖండిస్తున్నాం'

'సినిమా థియేటర్ యజమానులుగానీ, మరే ఇతర అసోసియేషన్‌గానీ అపెక్స్ బాడీలకు (తెలుగు చలన చిత్ర వాణిజ్య మండలి, తెలంగాణ రాష్ట్ర చలన చిత్ర వాణిజ్య మండలి, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి) ఎలాంటి నోటీసు ఇవ్వలేదు. కాబట్టి 'థియేటర్లు బంద్' అనే ప్రచారంలో నిజం లేదు. మా సంస్థలు తెలుగు చలనచిత్ర పరిశ్రమ
అభివృద్ధికి ఎప్పుడూ కృషి చేస్తాయి' అని ప్రకటనలో పేర్కొన్నారు. తెలంగాణలోని సింగిల్ స్క్రీన్ థియేటర్ యాజమాన్యాలు బుధవారం నుంచి పది రోజులపాటు ప్రదర్శనల్ని రద్దు చేస్తున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే.

# భూముల ధరలు సవరించాలి



సవరించాలి. ఇందుకు అవసరమైన చర్యలు చేపట్టండి. ఎక్కడెక్కడ, ఏయే ప్రాంతాల్లో ధరలను సవరించాలి... వ్యవసాయ భూములు, ఖాళీ స్థలాలు, ప్లాట్లు, అపార్ట్‌మెంట్లు.. వేటికి ఎంత సవరించాలనేది శాస్త్రీయంగా నిర్ధారించండి. రిజిస్ట్రేషన్, స్టాంపుల విభాగం వారు నిబంధనలను పక్కాగా పాటించాలి. రాష్ట్ర రాబడి పెంపుతో పాటు స్థిరాస్తి, నిర్మాణ రంగాన్ని ప్రోత్సహించేందుకు వీలుగా.. భూముల మార్కెట్ ధరల సవరణ జరగాలి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే స్టాంప్ డ్యూటీ ఎంత మేరకు ఉంది? దాన్ని తగ్గించాలా? పెంచాలా? అనేది కూడా అధ్యయనం చేయాలి" అని ముఖ్యమంత్రి ఆదేశించారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో ఉద్యోగుల కొరత లేకుండా సర్దుబాటు చేయాలని చెప్పారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలు ఇప్పటికీ చాలాచోట్ల అద్దె భవనాల్లో ఉన్నాయని, రిజిస్ట్రేషన్లకు వచ్చే వాళ్లు చెట్ల కింద నిలబడే ఉంటున్నారనే అంశం చర్చకు వచ్చింది. ప్రజా ప్రయోజనాల కోసం సేకరించిన స్థలాల్లో కొన్నిచోట్ల అధునాతనంగా మోడల్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను నిర్మించాలని, అందుకు సన్నాహాలు చేయాలని సీఎం స్పష్టం చేశారు.

**లక్ష్యాన్ని నిర్దేశించుకొని రాబడి సాధించాలి**

"రాష్ట్ర ఆదాయం పెంచేందుకు అన్ని విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయండి. అవినీతి, అక్రమాలకు అడ్డుకట్ట వేయాలి. పన్నుల ఎగవేత లేకుండా కఠిన చర్యలు చేపట్టాలి. వార్షిక లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరిగేందుకు అధికారులు పక్కా ప్రణాళికతో ముందుకు వెళ్లాలి. అందుకు తగిన సంస్కరణలు అవసరం. శాఖాపరమైన లొసుగులు లేకుండా కట్టుదిట్టంగా వ్యవహరించండి. గత ఏడాది వచ్చిన ఆదాయం ఆశాజనకంగా లేదు. ఇకపై ప్రతి నెలా ఆదాయ పెంపును సమీక్షించుకోవాలి. బడ్జెట్‌లో పొందుపరిచిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోవాలంటే.. ఏ నెలకు ఆ నెల తగిన మేరకు రాబడి సాధించాలి. ప్రధానంగా రాష్ట్రానికి రాబడి తెచ్చిపెట్టే జీఎస్టీ ఎగవేత ఉండకూడదు. జీఎస్టీ ఆదాయం పెంచేందుకు పక్కాగా క్షేత్ర స్థాయి తనిఖీలు, పరిశీలనలు చేయాలి. ఎగవేతదారులు ఎంతటివారైనా ఉపేక్షించొద్దు. నిక్కచ్చిగా పన్ను వసూలు చేయాల్సిందే. వాణిజ్య శాఖలో ఇంతకాలం జరిగిన పొరపాట్లు పునరావృతం కావొద్దు. జీఎస్టీ రిటర్న్ పేరిట వెలుగులోకి వస్తున్న అవినీతి, అక్రమాలకు తావీయకండి' అని సీఎం రేవంత్ ఆదేశించారు. గత ఆర్థిక సంవత్సరంలో ఎన్నికల సీజన్‌లో మద్యం అమ్మకాలు, విక్రయాలు ఎక్కువగా జరిగినా.. లక్ష్యానికి అనుగుణంగా ఆదాయం పెరగకపోవటానికి కారణాలపై ఆయన ఆరా తీశారు. అక్రమంగా మద్యం రవాణా, పన్ను ఎగవేత లేకుండా కట్టుదిట్టంగా చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. సామాన్యులకు, చిన్న చిన్న నిర్మాణాలకు ఇసుక కొరత రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ఇసుక ద్వారా వచ్చే ఆదాయం పెరగాలంటే అక్రమ రవాణాను, లీకేజీలను ఎక్కడికక్కడ అరికట్టాలని సీఎం చెప్పారు.

# రైతు సమస్యలపై బిఆర్ఎస్ ఆందోళన

**రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు..ధర్నాలు**

**హైదరాబాద్,:** కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ధర్నాలు చేపట్టారు. రాష్ట్ర ప్రభుత్వ పనితీరుపై రైతులు కన్నెర్రజేశారు. వ్యవసాయానికి కరెంటు, నీళ్లు ఇవ్వకుండా ఏడిపించిన ప్రభుత్వం ఇప్పుడు పండించిన వడ్లు కొనకుండా గోస పెడుతున్న తీరుపై అన్నదాతలు మండిపడుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ రైతాంగ వ్యతిరేక చర్యలకు నిరసనగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపు మేరకు..గురువారం రాష్ట్ర వ్యాప్తంగా( అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టారు. రైతులు, బీఆర్ఎస్ శ్రేణులు నిరసన కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారు. నల్లబ్యాడ్జీలు ధరించి ప్రభుత్వ కార్యాలయాలు, రహదారులపై ధర్నా చేపట్టారు.వడ్లకు రూ.500ల బోనస్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వ తీరు మారకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.




# సుప్రీంలో వాదనలు వినిపించిన ఇడి

**కేజ్రీవాల్ రాజకీయ వ్యాఖ్యలపై ఇడి అభ్యంతరం**

**బెయిల్ విషయంలో రాజీ లేదని సుప్రీం స్పష్టీకరణ**

**న్యూఢిల్లీ:** లోక్‌సభ ఎన్నికల్లో 'ఇండియా' బ్లాక్ గెలిస్తే జూన్ 2వ తేదీన తిరిగి తాను జైలుకెళ్లాల్సిన అవసరం ఉండదని ఢిల్లీ సిఎం అరవింద్ కేజ్రీవాల్ సోమవారం జరిగిన ఎన్నికల ప్రచారంలో అన్నారు. అయితే అరవింద్ కేజ్రీవాల్ ప్రసంగంపై ఇడి అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ మేరకు సుప్రీంకోర్టులో ఇడి పిటిషన్ దాఖలు చేసింది. ఇడి తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు గురువారం విచారణ జరిపింది. ఈ సందర్భంగా అరవింద్ కేజ్రీవాల్ వ్యాఖ్యలపై 'అది ఆయన వ్యక్తిగత అభిప్రాయం.. దీనిపై మేం ఏమీ చెప్పలేం' అని సుప్రీం ధర్మాసనం తెలిపింది. కేజ్రీవాల్ మధ్యంతర బెయిల్‌ను రద్దు చేసి, ఆయన్ని జైలు పంపాలన్న అభ్యర్థనను కోర్టు తిరస్కరించింది. కాగా, కేజ్రీవాల్ ఎప్పుడు కోర్టులో లొంగిపోవాలో తమ ఆదేశాల్లో స్పష్టంగా ఉందని, ఇది సుప్రీంకోర్టు ఆదేశమని అత్యున్నత న్యాయస్థానం పేర్కొంది. చట్టపాలన ఆధారంగానే ఉంటుందని, తాము ఎవరికీ మినహాయింపు ఇవ్వలేదని.. అదంతా కేజ్రీవాల్ ఊహేనని.. ఇందులో మాట్లాడడానికి ఏమీ లేదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది.



అరవింద్ కేజ్రీవాల్‌కు బెయిల్ మంజూరు చేయడంపై హోంమంత్రి అమిత్‌షా చేసిన వ్యాఖ్యలను అభిషేక్ మను సింఘ్వీ ధర్మాసనం ఎదుట ప్రస్తావించారు. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ కుంభకోణానికి సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కేజ్రీవాల్‌కు సుప్రీంకోర్టు మే 10న మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. జూన్ 2న లొంగిపోవాలని కోర్టు ఆదేశించింది.ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ అరెస్టును సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై గురువారం సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ దీపాంకర్ దత్తాలతో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారిస్తోంది. విచారణ సందర్భంగా కేజ్రీవాల్ తరపు న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీ మాట్లాడుతూ.. ఢిల్లీ సీఎంను అరెస్టు చేయడం సబబు కాదన్నారు. అతని రిమాండ్ కూడా సరైనది కాదని పేర్కొన్నారు. అయితే కేజ్రీవాల్ అరెస్ట్‌లో ఎలాంటి ప్రక్రియ ఉల్లంఘన జరగలేదని ఈడీ తరఫున అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజు తెలిపారు. దీనిపై సుప్రీంకోర్టు సొలిసిటర్ జనరల్‌ను కోరుతూ పిటిషన్ విచారణకు యోగ్యమైనదా లేదా అనే అంశంపై చర్చించాలని కోరింది. ఈ కేసులో సెక్షన్ 19ని ఉల్లంఘిస్తే కోర్టు జోక్యం చేసుకోవచ్చని కోర్టు పేర్కొంది. ఈ విషయమై గతంలో ఆయన పిటిషన్ దాఖలు చేసినా అప్పట్లో వినలేదు. ఎన్నికల సమావేశాల్లో కేజ్రీవాల్ ప్రకటనను ఈడీ వ్యతిరేకించింది. విచారణ సందర్భంగా కోర్టు ముందు కేజ్రీవాల్ చేసిన ప్రకటనను ప్రస్తావిస్తూ.. ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీకి ఓటు వేస్తే జూన్ 2న జైలుకు వెళ్లనని కేజ్రీవాల్ తన సమావేశాల్లో చెబుతున్నారని ఈడీ పేర్కొంది. దీనిపై జస్టిస్ ఖన్నా మాట్లాడుతూ.. మా ఉత్తర్వు స్పష్టంగా ఉందన్నారు. 'కేజ్రీవాల్‌కు ఎప్పటి వరకు ఉపశమనం లభిస్తుందో మేము మధ్యంతర బెయిల్ గడువును నిర్ణయించాము. మా ఆర్డర్ స్పష్టంగా ఉంది. ఎవరు ఏం మాట్లాడుతున్నారో అనే అంశంపై ఎలాంటి ఆందోళన లేదు. చట్టపరమైన సమస్యలపై మాత్రమే చర్చను ఉంచితే మంచిది.' అని స్పష్టం చేశారు.సాక్ష్యాలను అంచనా వేయడానికి అతను న్యాయపరమైన అధికారాలను ఉపయోగించకూడదు.

## ధాన్యం కొనుగోళ్లలో అదే ఉదాసీనత

**వరంగల్/నిజామాబాద్:** అన్నదాతలను ఏ ప్రభుత్వం వచ్చినా ఆదుకోవడం లేదన్నది అర్థం అయ్యింది. వర్షాలతో పంటలు నష్టపోయి రైతులు లబోదిబోమంటున్నా అధికారులు మాత్రం రైతుల వద్దకు వెళ్లడం లేదు. మార్కెట్ కమిటీలు ఉన్నా ఉత్తిదే అని తేలింది. వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు ప్రకటనలకే పరిమితం అయ్యారు. ఇటీవల ధాన్యం అకాల వర్షాలకు పూర్తిగా తడిసిపోయింది. అలాగే ధాన్యం కొనుగోళ్లు చురుకుగా సాగడం లేదు. గత ప్రభుత్వం ప్రచారార్భాటం చేసిందే తప్ప కొనుగోళ్లపై చిత్తశుద్ధి ప్రకటించలేదు. ఇప్పుడేమో ధర్నాలు, ఆందోళనలకు బిఆర్ఎస్ పిలుపునివ్వబం సిగ్గుచేటు. ఇకపోతే కాంగ్రెస్ కూడా అదే దారిలో నాడుస్తోంది. క్షేత్రస్థాయిలో మార్కెటింగ్ సిబ్బందిని పంపి ధాన్యం మొత్తాన్ని కొనేలా ప్రణాళికలు సిద్ధం చేయలేదు. దీంతో ఆరుగాలం కష్టపడి పండించిన రైతులు పంటను అమ్ముకోవడం అన్నదాలకు కష్టంగా మారింది. ఇప్పటికే ధరల హెచ్చు తగ్గులతో తీవ్రంగా నష్టపోతుండగా, పంటను అమ్ముకోలేని పరిస్థితి నెలకొంది. వరి, వేరుశనగ, జొన్న,మక్కజొన్న ఇలా పంట ఏదైనా కొనుగోళ్లు సక్రమంగా లేవు. మిల్లుల చుట్టూ తిరిగినా ఫలితం లేకపోవడంతో రైతులు ఆందోళనకు దిగుతున్నారు. కొన్నిచోట్ల రైతులు మార్కెట్ కార్యాలయానికి వెళ్లి అధికారులకు ఫిర్యాదు చేయగా వ్యాపారులను అడగాలని సూచించారు. రైతులు మిల్లుల వద్దకు వెళ్లి వేరుశనగను కొనుగోలు చేయాలని కోరగా కొందరు
నిరాకరించారు. మరికొందరు క్వింటాల్‌కి రూ.4వేల చొప్పున ఖరీదు చేస్తామని చెప్పారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు చూసి ఎవరూ కొనుగోలు చేయకపోవడంతో చేసేదేమీ లేక వరంగల్ జిల్లాలో వేరుశనగ రైతులు మళ్లీ బస్తాల్లో నింపుకొని ఇళ్లకు తీసుకెళ్లారు. పంట పండించడం ఒక ఎత్తయితే పంట అమ్ముకోవడం మరో ఎత్తవుతున్నది. మార్కెట్‌లో వేరుశనగను ఎవరూ ఖరీదు చేయకపోవడంతో అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడంలేదు. మిల్లుల వద్దకు వెళ్లి అడిగితే తక్కువ ధరకు కొంటామంటున్నరు. ఎకరానికి 10 క్వింటాళ్లకు పైగా దిగుబడి రావాల్సి ఉండగా, 5 క్వింటాళ్లే వచ్చింది. దిగుబడి తగ్గి నష్టపోగా, ధర లేకపోవడం, వ్యాపారులు కొనుగోలు చేయడానికి ముందుకు రాకపోవడంతో సాగుచేయడం భారంగా మారుతోంది. మద్దతు ధర పెట్టిన పెట్టుబడి రాక ఆర్థికంగా నష్టపోవాల్సి వస్తోంది. మద్దతు ధర చెల్లించడంలో ప్రభుత్వం విఫలమైంది. ధాన్యం కొనుగోళ్లలో జాప్యంతో అకాల వర్షానికి వడ్ల బస్తాలు తడిసి ముద్దయ్యాయని రైతులు ఆగ్రహం వ్యక్తంచేశారు. కామారెడ్డి జిల్లాలో న్నదాతలు ఆందోళన చేపట్టారు. ధాన్యం తూకం వేయకుండా, తూకం వేసిన ధాన్యం తరలించకుండా నిర్వాహకులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. అధికారులు, కొనుగోలు కేంద్రాల నిర్వాహకుల తీరుకు నిరసనగా బోధన్-హైదరాబాద్ జాతీయ రహదారిపై రైతులు బైఠాయించారు. ఐదు రోజులుగా ధాన్యం కొనుగోళ్లు నిలిచిపోయాయని, రెండు రోజులుగా కురుస్తున్న వర్షానికి ధాన్యం తడుస్తున్నదని తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో కాంటాల సంఖ్య పెంచి లారీల కొరత తీరుస్తామని హామీ ఇవ్వాలని కోరుతున్నారు.

తామే కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చిన ధాన్యం పది రోజుల నుంచి తూకం చేయడం లేదు. సొసైటీ వాళ్లను అడిగితే రైస్‌మిల్లర్లు వద్దని చెబుతున్నారని సమాధానం ఇస్తున్నారు.

జిల్లాస్థాయి అధికారులు స్పందించి ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేసి మా రైతులను ఆదుకోవాలని కోరుతున్నారు. ధాన్యం కొనకపోవడంతో అకాల వర్షాలకు ధాన్యం తడిసింది. మొలకలు వస్తున్నాయి. అధికారులు స్పందించి ధాన్యం వెంటనే కొనుగోలు చేయాల్సి ఉంది. ఇకపోతే ఇటీవల కురిసిన అకాల వర్షం రైతులకు అపార నష్టం మిగిల్చింది. పలు గ్రామాల రైతులు విక్రయానికి తీసుకొచ్చిన జొన్నలతోపాటు తూకం వేసిన జొన్న బస్తాలు వర్షానికి తడిసి ముద్దయ్యాయి.

# నెలాఖరులోపు పాఠశాలల్లో ప్రగతి పనులు పూర్తి చేయాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

**నారాయణపేట టౌన్, మే 16 మనసాక్షి :-**




జిల్లాలోని అన్ని ప్రభుత్వ ప్రాథమిక, మాధ్యమిక, ఉన్నత పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన మౌలిక వసతుల నిర్మాణ పనులను నెలాఖరులోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలకు సంబంధించిన అభివృద్ధి నిర్మాణ పనులపై అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.... జూన్ 30 లోపు పాఠశాలలో వివిధ నిర్మాణ, అవసరమైన మరమ్మతు పనులను పూర్తి చేస్తే, జూన్ మొదటి వారంలో పాఠశాలలకు రంగులు వేయించాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని మండలాల వారీగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ద్వారా ఎన్ని నిర్మాణ పనులు మంజూరయ్యాయి? ఎన్ని ప్రారంభించారు? ఇంకా ఎన్ని ప్రారంభించాల్సి ఉందని కలెక్టర్ పంచాయతీరాజ్ ఏఈలను అడిగి తెలుసుకున్నారు. ఇంకా ప్రారంభించాల్సి ఉన్న పనులను రెండు రోజుల్లో మొదలుపెట్టి నెలాఖరు నాటికి పూర్తిచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా మరికల్ మండల కేంద్రంలోని పాఠశాలలను పరిశీలించి, పాఠశాలలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన కు ఎస్టిమేట్ తయారు చేసి ఇవ్వాలని, వెంటనే ఆయా పాఠశాలల్లో నిర్మాణ పనులను పూర్తి చేయాలని పీఆర్ డిఈఈ ని ఆదేశించారు. అలాగే మద్దూరు, కోస్గి మండలాల్లోనూ అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ద్వారా చేపట్టిన నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయించాలన్నారు. కేజిబివి పాఠశాలల ప్రహరీల పనులకు ఎస్టిమేట్ తయారు చేసి పనులు ప్రారంభింపజేయాలని చెప్పారు. ఊట్కూరు మండలంలోని కొల్లూరు, పెద్దపొర్ల , మొగ్దూంపూర్ పాఠశాలల్లో ప్రతిపాదించిన నిర్మాణ పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. మాగనూర్ మండలంలోని వడ్వాట్ గ్రామ పాఠశాలలో ఎందుకు పనులు నిలిచి పోయాయని ఏ ఈ ని ప్రశ్నించారు. ఎలాంటి సమస్య లు వచ్చినా సమన్వయం చేసుకొని పనులు పూర్తి చేసేందుకు అధికారులు కృషి చేయాలని కలెక్టర్ సూచించారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల జిల్లా అదనప కలెక్టర్ మయాంక్ మిత్తల్, డి ఆర్ డి ఓ రాజేశ్వరి, సి పి ఓ జివరత్నం, అడిషనల్ డిఆర్డి ఓ అంజయ్య, విద్యా శాఖ అధికారులు శ్రీనివాస్, అన్ని మండలాల పంచాయతీరాజ్ ఏఈలు పాల్గొన్నారు.

# హేమాచల లక్ష్మీ నరసింహుని పెళ్లికి కాశ్మీరీ కుంకుమ పువ్వు కానుక.

## పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు.

## స్వామివారి కళ్యాణం సందర్భంగా సమర్పించిన జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ డైరెక్టర్ నాసిరెడ్డి సాంబశివ రెడ్డి.

**మంగపేట మే 16, మన సాక్షి ప్రతినిధి**




హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు ఈనెల పంతొమ్మిది నుండి ప్రారంభమవుతున్న సందర్భంగా స్వామివారి కళ్యానానికి అరుదైన శీతల వాణిజ్య సుగంధ ద్రవ్య పంట సుగంధ రారాణి కాశ్మీర్ కుంకుమ పువ్వుని ఆలయ అర్చకులు స్వామి వారి కళ్యాణానికి వినియోగించనున్నారు. ఈ నెల 23న ములుగు జిల్లా మంగపేట మండలం మల్లూరులో జరగనున్న శ్రీ హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం సందర్భంగా జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ కమిటీ డైరెక్టర్ రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు నాసిరెడ్డి సాంబశివ రెడ్డి కాశ్మీర్ రాష్ట్రం నుండి స్వామి వారి కోసం ప్రత్యేకంగా తెప్పించిన శీతల సుగంధ పంట కుంకుమ పువ్వు పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు గురువారం హేమాచల లక్ష్మీ నరసింహ స్వామి దేవస్థానం అధికారులు మరియు అర్చకులకు సమర్పించారు. అనంతరం కుటుంబ సమేతంగా స్వామివారి సన్నిధిలో పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు ఈ సందర్భంగా సాంబశివరెడ్డి మాట్లాడుతూ. మల్లూరు లో ఈ నెల 23న జరగనున్న లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ ఉత్సవాలకు జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ కమిటీ మెంబర్ గా స్వామివారికి కాశ్మీరీ కుంకుమ పువ్వు ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రాలు బహూకరించడం తనకు ఎంతో సంతోషంగా ఉందని దేవుడి ఆశీస్సులు చల్లని దీవెనలు ప్రజలపై ఉండాలని ముఖ్యంగా వ్యవసాయం బాగుండాలని ప్రార్థించినట్టు తెలిపారు. లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణం రోజు కుంకుమ పువ్వు ముత్యాల తలంబ్రాలు పట్టు వస్త్రాలు స్వామి వారికి కల్యాణ మండపంలో సమర్పించాలని అనుకున్నామని. కానీ సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ కోడ్ అమల్లో ఉన్నందున దేవస్థానం అధికారులకు ముందుగానే గురువారం అందజేసినట్లు ఆయన తెలిపారు. కాగా సాంబశివరెడ్డి జాతీయ మిర్చి టాస్క్ ఫోర్స్ కమిటీ మెంబర్ గా భారత ప్రభుత్వం నుండి నియమితులైన దగ్గర నుండి గడిచిన నాలుగు సంవత్సరాలుగా స్వామి వారికి పట్టు వస్త్రాలు ముత్యాల తలంబ్రాలు సుగంధ హారాలను సమర్పిస్తుండగా ఈ సంవత్సరం కాశ్మీరీ కుంకుమ పువ్వు సమర్పించడం విశేషం. ఈ కార్యక్రమంలో ఆలయ సీనియర్ అసిస్టెంట్ నేతాని సీతారాములు ఆలయ ప్రధాన అర్చకులు కైంకర్యం రాఘవాచార్యులు, క్లర్క్ నూతల కంటి అజయ్, మరియు ఆలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్ వ్యవహారం

## మెడికల్ అధికారిపై సర్వత్రా ఆగ్రహం

## కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్

## కేసు నమోదు చేసి అరెస్ట్ చేసిన పోలీసులు

**కామారెడ్డి:** మహిళ మెడికల్ ఆఫీసర్లను కామారెడ్డి జిల్లా డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్ లైంగిక వేధింపుల ఘటన జిల్లాలో కలకలం రేపింది. ఈ ఘటనపై సర్వత్రా నిరసనలు వస్తున్నాయి. కఠిన చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. ఈ క్రమంలో డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్ పై దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేశారు. మహిళా మెడికల్ ఆఫీసర్లు ఇచ్చిన ఫిర్యాదు మేరకు దేవునిపల్లి పోలీస్ స్టేషన్‌లో వివిధ సెక్షన్ల కింద 7 కేసులు నమోదు చేసినట్లు కామారెడ్డి డీఎస్పీ నాగేశ్వరరావు తెలిపారు. తమను ఏడాదిన్నర కాలంగా లైంగికంగా వేధిస్తున్నట్లు ఫిర్యాదులో మహిళ మెడికల్ ఆఫీసర్లు పేర్కొన్నారు. డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్‌ను దేవునిపల్లి పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు. కామారెడ్డి డీఎంహెచ్ఓ లక్ష్మణ్ సింగ్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఏడాది కాలంగా తమను లైంగిక వేధింపులకు గురి చేస్తున్నాడంటూ మహిళ మెడికల్ ఆఫీసర్లు ఆవేదన వ్యక్తం చేశారు. దీనిపై రాష్ట్ర వైద్య శాఖ అధికారులు విచారణ చేపట్టారు. వివాదాస్పద వ్యాఖ్యలు, వేధింపుల ఘటనపై డీఎంహెచ్ఓపై ఉన్నతాధికారులు సైతం ఫైర్ అయ్యారు. లైంగిక వేధింపుల ఘటనపై డైరక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ ఫ్యామిలీ అడిషనల్ డైరక్టర్ అమర్ సింగ్ నాయక్ ఆధ్వర్యంలో విచారణ జరిగింది. ఈ విచారణలో తమను లైంగికంగా వేధింపులకు గురి చేశారని 10 మందికి పైగా మహిళా మెడికల్ ఆఫీసర్లు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. లైంగిక వేధింపుల ఆరోపణలు ఎదుర్కొంటున్న కామారెడ్డి డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, సూపరింటెండెంట్ శ్రీనునాయక్‌ను బుధవారం రాత్రి పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. లక్ష్మణ్ సింగ్, శ్రీనునాయక్‌పై తాజాగా మరికొందరు పీహెచ్‌సీల మహిళా మెడికల్ ఆఫీసర్లు కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఇద్దరు అధికారులపై 354, 354 డీ, 509 సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి విచారణ కోసం అదుపులోకి తీసుకున్నారు. డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, సూపరింటెండెంట్ శ్రీనునాయక్ తనిఖీల పేరిట వస్తూ తమను లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారంటూ జిల్లాలోని పలు పీహెచ్‌సీలకు చెందిన 21 మంది మహిళా మెడికల్ ఆఫీసర్లు 10 రోజుల కింద వైద్యారోగ్య శాఖకు ఫిర్యాదు చేశారు. 'పీహెచ్‌సీకి వచ్చినప్పుడు డీఎంహెచ్‌వో పక్కన కూర్చొమనేవారు.. కూర్చోకపోతే పనిలో లోపాలు వెతికి వేధించేవారు. ఫోన్ చేసి మరీ సంసారం జీవితం ఎలా సాగుతుందంటూ అభ్యంతరకరంగా మాట్లాడేవారు' అంటూ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ ఆదేశాల మేరకు ఏడీహెచ్ అమర్‌సింగ్ నాయక్ బుధవారం కామారెడ్డి డీఎంహెచ్‌వో కార్యాలయంలో విచారణ చేపట్టారు. ఇరు వర్గాలను పిలిపించి.. వారితో మాట్లాడారు. విషయం తెలిసి స్థానిక ఎమ్మెల్యే వెంకటరమణారెడ్డి అక్కడికి చేరుకోగా.. వేధింపుల విషయాన్ని పలువురు మహిళా ఉద్యోగులు ఆయన దృష్టికి తీసుకెళ్లారు. అయితే నిబంధనలకు విరుద్ధంగా విచారణ జరుగుతోందని ఎమ్మెల్యే తప్పుబట్టారు. బాధిత మహిళా ఉద్యోగులతో పాటు మరికొందరు అధికారులూ ఇక్కడికి రావాలన్నారు. డీఎంహెచ్‌వో, సూపరింటెండెంట్‌ల తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. గత కొన్నేళ్లుగా వీరు ఉద్యోగాల నియామకాలు, డిప్యుటేషన్ల విషయంలోనూ అక్రమాలకు పాల్పడ్డారని ఆరోపించారు. దీనిపై స్పందించిన ఏడీహెచ్ అమర్‌సింగ్.. డీఎంహెచ్‌వోతో పాటు ఇతర ఉద్యోగులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతీ అంశాన్ని రికార్డు చేశానని, విచారణ నివేదికలో వాటిని పొందుపర్చి.. ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు ఆయన వెల్లడించారు.

# మహానాడు కార్యక్రమానికి బ్రేక్

## ఎన్నికల ఫలితాల కారణంగా రద్దు

## యధావిధిగా గ్రామాల్లో రక్తదాన శిబిరాలు

## జెండా విష్కరణలు చేపట్టాలి: బాబు

అమరావతి: ప్రతీ ఏటా పండుగలా జరిగే టీడీపీ మహానాడు కార్యక్రమానికి ఈసారి కాస్త బ్రేక్ పడింది. అందుకు ఎన్నికల పలితాలే కారణం. ఈనెల 27, 28 తేదీల్లో టీడీపీ మహానాడు జరగాల్సి ఉంది. అయితే జూన్ 4న ఎన్నికల ఫలితాలు, అందుకు ఏర్పాట్లు, అనంతరం ప్రభుత్వం ఏర్పాటు హడావుడి ఉండటంతో వాయిదా వేయాలని తెలుగుదేశం పార్టీ నిర్ణయించింది. ఈ విషయాన్ని టెలికాన్ఫరెన్స్‌లో అధినేత చంద్రబాబు నాయుడు వెల్లడించారు. అయితే మహానాడు మాదిరిగా అన్ని గ్రామాల్లో ఎన్టీఆర్‌కు నివాళి, పార్టీ జెండాలు ఎగురవేయడం, రక్తదాన శిబిరాలు యధావిధిగా ఉంటాయని అధినేత చెప్పారు. తిరిగి ఎప్పుడు మహానాడు నిర్వహిచాలి?.. తేదీలపై మరోసారి ప్రకటన చేద్దామని టీడీపీ చీఫ్ పేర్కొన్నారు. తాడిపత్రిలో టీడీపీ సానుభూతిపరులపై డీఎస్పీ చైతన్య చేసిన దాడిపై చంద్రబాబు సీరియస్ అయ్యారు. అతను రాజంపేట నుంచి తాడిపత్రి ఎలా వచ్చారని బాబు ప్రశ్నించారు.. డీఎస్పీ ఆగడాలు, దౌర్జన్యకాండపై ఎన్నికల కమిషన్‌కు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయాలని పార్టీ నేతలకు ఆదేశాలు జారీ చేశారు. అలాగే చీఫ్ సెక్రటరీ వ్యవహార శైలిపై చంద్రబాబు, పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ రెండు రోజులు ముందు డీబీటీకి నిధుల విడుదలపై హడావుడి చేయడం ఏంటని చంద్రబాబు ప్రశ్నించారు. వృద్ధుల పెన్షన్ల విషయంలో సీఎస్ వ్యవహారశైలిని కూడా టీడీపీ నేతలు ప్రస్తావించారు. అన్ని గుర్తు ఉంటాయంటూ ఈ సందర్భంగా చంద్రబాబు చెప్పారు.



# బాధిత కుటుంబాన్ని పరామర్శించిన కె ఎస్ ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ.

**దోమ మండలం, మే 16 మన సాక్షి:**



మోత్కూరు గ్రామంలో గూద పెంటయ్య అనారోగ్యంతో మరణించారు, ఈ విషయం తెలుసుకున్న కే ఎస్ ఆర్ ఆర్ ట్రస్ట్ వ్యవస్థాపకురాలు రాజేశ్వరమ్మ వారి ఇంటికి వెళ్లి భౌతిక దేహానికి నివాళులు అర్పించి, కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యాన్ని కల్పించారు. మీ కుటుంబానికి కె ఎస్ఆర్ ట్రస్ట్ అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఆమె మాట్లాడుతూ ... గ్రామంలో అన్ని కులాలు అన్ని పార్టీలు అన్ని వర్గాలు అందరూ నా కుటుంబ సభ్యులే ఎవ్వరికీ ఏమైనా ఆ కుటుంబానికి నా వంతు సహాయ సహకారాలు ఉన్నాయని తెలిపారు, ఈ కార్యక్రమంలో గూద చిన్నయ్య దండు గోపాల్ గూద విజయ్ తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరగాళ్ల చేతిలో మోసపోవద్దు, తస్మాత్ జాగ్రత్త. జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్.

**నారాయణపేట టౌన్, మే 16 మనసాక్షి :-**



సైబర్ నేరగాళ్ల నుండి ప్రజలు అప్రమత్తంగా ఉండాలి అని సైబర్ నేరగాళ్లు చూపే మోసపూరిత ఆశలకు గురి కావద్దని జిల్లా ఎస్పీ శ్రీ యోగేష్ గౌతమ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతము సైబర్ నేరగాళ్లు అనేక రకాలుగా ప్రజలను మోసం చేయడం జరుగుతుందని అధిక లాభాల కోసం ఆశపడి ఆన్లైన్లో పెట్టుబడి పెట్టకండి ఎవరో చెప్పింది విని లేదా సోషల్ మీడియాలో వచ్చే యాడ్స్ చూసి మోసపోకండి, మీరు పెట్టుబడి పెట్టండి మరియు మీ బంధుమిత్రులతో ఎవరైనా కొత్త వ్యక్తులు మీకు క్యూఆర్ కోడ్ పంపించి దాన్ని స్కాన్ చేస్తే మీకు డబ్బులు వస్తాయని చెప్తే నమ్మకండి అది సైబర్ మోసం అని గ్రహించాలన్నారు. సైబర్ నేరగాళ్లతో తస్మాత్ జాగ్రత్త అని ఆన్లైన్ లోన్ ఆప్స్ ద్వారా లోన్స్ తీసుకోరాదని ఎస్పీ సూచించారు. లోన్ ఆప్స్ వేధింపులకు మీలో మీరే బాధపడవద్దు, 1930 కి లేదా డయల్ 100 కి కాల్ చేసి పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. ఎవరైనా ఈ తరహా మోసాల బారినపడితే 1930 కి ఫోన్ చేయాలని అన్నారు. ఆన్లైన్ సైబర్ నేరగాళ్ల మోసాల్లో పడకుండా అప్రమత్తంగా ఉండడం అవశ్యకం అని ఎస్పీ తెలిపారు. సైబర్ నేరాలపై ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలని పోలీసులకు ఆదేశాలు ఇవ్వడం జరిగింది అని ఎస్పీ తెలిపారు. ప్రజలు మీరు జాగ్రత్తగా ఉండండి తోటి వారిని సైబర్ నేరాల బారిన పడకుండా వారికి అవగాహన కల్పించండి అని ఎస్పీ కోరారు.

# లైన్స్ క్లబ్ సేవలను విస్తృత పరచాలి...

**అందోలు, మే16, మనసాక్షి :**



**లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్. రవీందర్ గౌడ్... జోగిపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక**

లైన్స్ క్లబ్ సేవలను విస్తృత పరచాలని లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ డాక్టర్ ఎస్. రవీందర్ గౌడ్ అన్నారు.గురువారం2024-25 సంవత్సరానికి గాను జోగిపేట లయన్స్ క్లబ్ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక లయన్స్ భవన్ లో లయన్స్ డాక్టర్ ఎస్. రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో లయన్స్ క్లబ్ జోగిపేట పట్టణ అధ్యక్షులు గా అల్లే శ్రీకాంత్, సెక్రటరీగా జిఆర్. మధుసూదన్ రెడ్డి, కోశాధికారిగా గడ్డమీది సంతోష్, మిగతా కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్. రవీంద్ర గౌడ్ మాట్లాడుతూ నూతనంగా ఎన్నికైన కార్యవర్గ సభ్యులకు ఆయన శుభాకాంక్షలు తెలియజేశారు. జోగిపేట పట్టణంలో సామాజిక సేవా కార్యక్రమాలు మరింతగా విస్తరింప చేయాలని ఆయన సభ్యులకు సూచించారు. క్లబ్బుకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని, లయనిజాన్ని పెంపొందించేందుకు కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# చేతిరాత నేర్చుకో... నీ తలరాత మార్చుకో..!

**దుబ్బాక, మే 16, మనసాక్షి:**

**25 నుండి చేతిరాతపై శిక్షణ**

**చేతిరాత నిపుణులు ఏజాస్ అహ్మద్**



ప్రతి విద్యార్థికి చేతిరాత ఎంతో అవసరమని, చేతిరాతనే తన తలరాత మారుస్తుందని చేతిరాత నిపుణులు ఏజాస్ అహ్మద్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ... ఈనెల 25 నుండి దుబ్బాకలో చేతిరాతపై పది రోజులపాటు శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. చేతిరాత ప్రతి ఒక్కరి మనుగడకు ఎంతో అవసరమని సూచించారు. విద్యార్థులు ఇటీవల జరిగిన పరీక్షల్లో చేతిరాతతో కూడా ఎంతోమంది మార్కులు సాధించారని, ప్రతి ఒక్కరి చేతిరాత బాగుంటే వారి భవిష్యత్తు కూడా బాగుంటుందని ఆయన అన్నారు. పది రోజులపాటు పట్టణంలోని గాయత్రి వివేకానంద విద్యాలయంలో నిర్వహించే శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఉదయం 8:30 నుండి 11:30 వరకు శిక్షణ ఉంటుందన్నారు. ఆసక్తి గలవారు పేరు నమోదు చేసుకోవాలన్నారు. ఈ శిక్షణ గాను రూ.1200 ఉంటుందని అన్నారు. ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# దొడ్డు వడ్లకు కూడా బోనస్ ఇవ్వాలి

## - మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి,

**కంగ్టి, మే 16, మన సాక్షి :-**



రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా గురువారం సంగారెడ్డి జిల్లా నారాయణఖేడ్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే మహా రెడ్డి భూపాల్ రెడ్డి ధర్నా నిర్వహించారు. దొడ్డు వడ్లకు కూడా 500 బోనస్ ఇవ్వాలని, తడిసిన వడ్లను కొనుగోలు చేసి రైతులను ఆదుకోవాలని అయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రైతులకు మరోసారి మోసం చేసిన కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల అనంతరం రూ.500 బోనస్ ఇస్తానని ఇప్పుడు సన్నం మడ్లకు ఇస్తామని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు.రైతులకు న్యాయం జరిగే వరకు పోరాటం చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసిలు నరసింహారెడ్డి,విజయరామరాజు,జిల్లా కోఆప్షన్ సభ్యులు డాక్టర్ అలీ, ఎంపీపీలు మైపాల్ రెడ్డి,జంగం శ్రీనివాస్, మండల పార్టీ అధ్యక్షులు పరమేష్, సంజీవ్ రావు పాటిల్, మాజీ మండల అధ్యక్షులు ప్రభాకర్ రైతు సమన్వయ సమితి అధ్యక్షులు సత్యపాల్ రెడ్డి, మాజీ ఆత్మ చైర్మన్ దిలీప్ మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బషీద్, పట్టణ అధ్యక్షులు నగేష్ సెట్,సర్పంచులు, ఎంపీటీసీలు, గ్రామ పార్టీ అధ్యక్షులు ఉప సర్పంచ్లు, అనుబంధ సంఘాల సభ్యులు,బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# వ్యవసాయ కుటుంబం నుండి డాక్టరేట్

## నర్సంపల్లి వాసికి డాక్టరేట్



**నాగర్కర్నూల్ జిల్లా, ఊర్కొండ మే 16 మన సాక్షి**

పాలమూరు యూనివర్సిటీ పరిధిలో వనపర్తి పిజి సెంటర్లో మైక్రో బయాలజీ విభాగంలో విధులు నిర్వహిస్తున్న విజయ్ కుమార్ కు పాలమూరు విశ్వవిద్యాలయం మైక్రో బయాలజీ విభాగం నుండి అత్యున్నత డాక్టరేట్ డిగ్రీ ప్రదానం చేశారు. విజయ్ కుమార్ ప్రాథమిక విద్యను ఊరుకొండ మండలంలోని నర్సంపల్లి గ్రామంలో హై స్కూల్ విద్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఉరుకొండ పేట ఇంటర్మీడియట్ విద్య ఉషోదయ జూనియర్ కాలేజీ కల్వకుర్తి %ు% బిఎస్సి డిగ్రీ డాక్టర్ బి.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల జడ్చర్ల యందు పూర్తి చేసి,ఎమ్మెస్సీ మైక్రో బయాలజీ పాలమూరు విశ్వవిద్యాలయం నుండి పూర్తి చేసి,అధ్యాపక వృత్తిలో 12 సంవత్సరాల అనుభవం గడించి, తెలంగాణ ప్రభుత్వం నిర్వహించినటువంటి సెట్ ఎగ్జామినేషన్ పాసై, తద్వారా పాలమూరు యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగం నందు పిహెచ్డి అడ్మిషన్ పొందడం జరిగింది. పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్టర్ డాక్టర్ డి మధుసూదన్ రెడ్డి గారి పర్యవేక్షణలో రెమిడీయేషన్ స్టడీస్ ఆన్ ఫిజికో కెమికల్ మైక్రో బయోలాజికల్ అనాలసిస్ ఆఫ్ వాటర్ ఫర్ రిస్టోరేషన్ ఆఫ్ పెద్ద చెరువు మహబూబ్నగర్ అని అంశంపై పరిశోధన పూర్తి చేసి పాలమూరు విశ్వవిద్యాలయం నుండి అత్యున్నత డిగ్రీ అయినటువంటి పీహెచ్డీ పొందాడు. ఈ సందర్భంగా పాలమూరు విశ్వవిద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ ఎల్బి లక్ష్మీకాంత్ రాథోడ్ రిజిస్టర్ ప్రొఫెసర్ పిండి పవన్ కుమార్ కంట్రోల్ ఆఫ్ ఎగ్జామినేషన్ డాక్టర్ రాజ్ కుమార్ సూపర్వైజర్ డాక్టర్ డి మధుసూదన్ రెడ్డి అభినందించారు. ఈసందర్భంగా విజయ్ కుమార్ ను తల్లిదండ్రులు,భార్య %ు% అన్న పాండుగౌడ్ %ు%నర్సంపల్లి గ్రామం నుండి తొలి విద్యావంతుడు తొలి డాక్టర్ అయినటువంటి విజయ్ కుమార్ ను గ్రామ పెద్దలు అభినందించారు.

# ప్రజా సమస్యలు పరిష్కారం

**దుబ్బాక, మే 16, మనసాక్షి :**

'మనసాక్షి శీర్షికకు స్పందన



ఇటీవల మనసాక్షి దినపత్రికలో " పారిశుధ్య సమస్య పరిష్కరించండి సారూ..! " అనే శీర్షికకు స్పందించి దుబ్బాక మున్సిపల్ అధికారులు సిబ్బంది పట్టణంలోని పారిశుధ్య సమస్యను పరిష్కరించారు. డబుల్ బెడ్ రూమ్ ఇంట్లో వద్ద పారిశుద్ధ్య సమస్యలు పరిష్కరించాలని ఎన్నోసార్లు అధికారులకు విన్నవించిన పెడచెవిన పెట్టారని, ఇటీవల పార్టీల నాయకులు, పలు పత్రికల్లో రాగానే స్పందించి సమస్యను పరిష్కరించారని వారన్నారు. అంతేకాకుండా పట్టణంలో ఉన్న మరిన్ని వార్డులో పారిశుధ్య సమస్యను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. కమిషనర్ రమేష్ మాట్లాడుతూ... ప్రజల సమస్యలు పరిష్కరించడమే మున్సిపల్ అధికారుల సిబ్బంది లక్ష్యమని తెలిపారు. వర్షాల మూలంగా జామైన డ్రైనేజీల సమస్యను త్వరితగతింగా పరిష్కరిస్తామని తెలిపారు. ప్రజలు మున్సిపల్ అధికారులకు, సిబ్బందికి సహకరించాలని అన్నారు.

# ప్రమాదాన్ని పొంచి ఉన్న చెట్టు....!!!!!

**లక్షెట్టిపేట్ మే 16 (మన సాక్షి)బీ**



లక్షట్ పేట్ మున్సిపాలిటీ పరిధిలో లక్షెట్టిపేట్ నుండి మంచిర్యాల్ వెళ్లే జాతీయ రహదారిపై ఉత్కూర్ చౌరస్తా దగ్గర పూర్తిగా ఎండిపోయిన చెట్టు. గత నాలుగు రోజుల నుండి వస్తున్న ఈదురు గాలులకు పడిపోయే ప్రమాదం ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వాహనాలతో నడిచే రహదారి కాబట్టి ఒకవేళ చెట్టు పడిపోతే చాలా పెద్ద ప్రమాదమే జరగవచ్చని. పెద్ద ప్రమాదం జరగక ముందే సంబంధిత అధికారులు చర్యలు తీసుకుంటే బాగుంటుందని ప్రయాణికులు కోరుతున్నారు.

# పట్టభద్రుల సమస్యలపై పోరాడే ప్రజా గొంతుకగా నిలుస్తా

## - ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న



**మిర్యాలగూడ టౌన్, మే 16, మన సాక్షి:**

కెసిఆర్ గత పది సంవత్సరాల పాలనలో నిరుద్యోగులను నడి బజారుకు పాలు చేసిన కేసీఆర్ని నడిరోడ్డు మీద ఉరితీయాలని తీన్మార్ మల్లన్న ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఎస్పి కన్వెన్షన్ హాల్లో పట్టభద్రుల ఆత్మీయ సమ్మేళన కార్యక్రమంలో పాల్గొన్నారు. నిరుద్యోగులను చావు దెబ్బ కొట్టిన కేసీఆర్ ను క్షమించకూడదని చెప్పారు. ఉద్యోగ ఉపాధ్యాయలను వేధింపులకు గురిచేసి నెలసరి వేతనాలు కూడా సక్రమంగా రాకుండా చేశారని,ఇటువంటి నేత పుణ్యమే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నిక వచ్చిందని పేర్కొన్నారు. జీవో 47 ,137 జీవో వల్ల నిరుద్యోగులు ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కెసిఆర్ చేపట్టిన ఏ స్కీమ్ అయిన ఏ పథకమైన అవినీతి ఉన్నదని చెప్పారు. చివరకు ఆయన ప్రజల కోసం పోరాడింది ఏమీలేదని ఆయన బిడ్డ సారాస్కాంలో జైలు పాలు అయిందన్నారు. గ్రూప్ వన్ పరీక్షలు మోడల్ స్కూల్ అవినీతి , నిరుద్యోగుల భవిష్యత్తు ఆటలాడుకోవడం వంటి పలుస్కాములు చేసిన కెసిఆర్ కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆగస్టు లోపు జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తుందని ఈ సందర్భంగా చెప్పారు. ఎమ్మెల్సీ గెలుపు అనంతరం మిర్యాలగూడలో లక్ష్మారెడ్డి సహకారంతో నియోజకవర్గ అభివృద్ధి కోసం పనిచేస్తానని చెప్పారు. అదేవిధంగా ఉద్యోగులకు రావాల్సిన డిఏలు ఫిట్మెంట్ పిఆర్సి వంటి సమస్యలను పరిష్కరిస్తానని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. మిర్యాలగూడ ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ నిరుద్యోగులకు ఎటువంటి కష్టాలు రాకుండా చూసుకోవాలని ఆయన గెలుపు కోసం 100 శాతం పని చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ ఎంప్లాయిస్ నాయకులు చంద్రారెడ్డి , కాంగ్రెస్ నాయకులు నూకల వేణుగోపాల్ రెడ్డి, అర్జున్, తలకొప్పల సైదులు ,గాయం ఉపేందర్ రెడ్డి,రావు ఎల్లారెడ్డి,బెజ్జం సాయి, శ్రీనివాస్ , మహబూబ్ అలీ, సిద్ధ నాయక్ తదితరులు పాల్గొన్నారు

# నీలం మధును కలిసిన నాయకులు



**గజ్వేల్,మే,16,మన సాక్షి**

మెదక్ కాంగ్రెస్ అభ్యర్థి నీలం మధు ముదిరాజ్ వారి పెళ్లిరోజు సందర్భంగా మర్యాదపూర్వకంగా కలిసిన గజ్వేల్ నియోజకవర్గ ముదిరాజ్ మహాసభ కో కన్వీనర్ మన్నే శ్రీనివాస్ ముదిరాజ్. ఈ సందర్భంగా మాట్లాడుతూ గజ్వేల్ నియోజకవర్గంలో అంతరిపోర్టు బాగానే ఉన్నదని, భారీ మెజార్టీతో గెలుస్తున్నామని,మీ గెలుపుతో ముదిరాజులకు ఎంతో మేలు జరుగుతుందని ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు యూనిఫామ్ లు సిద్ధం చేయాలి

## జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.



**నారాయణపేట టౌన్, మే 16 మనసాక్షి :-**

జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు కొత్త యూనిఫామ్ లను తయారు చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సూచించారు. గురువారం జిల్లా కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో మహిళా సంఘాల ద్వారా స్కూల్ యూనిఫామ్ ల తయారీ పై డి ఆర్ డి ఏ, విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో ఒకటి నుంచి పదో తరగతి వరకు చదివే విద్యార్థుల వివరాలు, వారికి కుట్టించే దుస్తుల (యూనిఫామ్) కొలతలు సిద్ధంగా ఉన్నాయా ? అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో వివిధ తరగతులలోని విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బల్క్ క్లాత్ శుక్రవారం వస్తుందని, మండలాల వారీగా ఏపీఎంఓలు ఆ క్లాత్ ను తీసుకుని శనివారం మాస్టర్ ట్రైనర్లతో సైజ్ లను కట్ చేయించి ఆదివారం సాయంత్రంలోపు మహిళా సంఘాలకు అప్పగించాలని ఆదేశించారు. ఈ నెల 20 నుంచి యూనిఫాంల స్టిచ్చింగ్ (కుట్టే) ప్రక్రియను ప్రారంభించాలన్నారు. రోజూ ఎన్ని జతల యూనిఫామ్ లు కుట్టారనే వివరాలను ఎప్పటికప్పుడు తెలియజేయాలన్నారు. జిల్లాలోని మహిళా సంఘాలలో ఎంతమంది మహిళలు టైలర్లు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. యూనిఫామ్లను కుట్టడానికి వారి వద్ద కుట్టు మిషన్లు సిద్ధంగా ఉన్నాయా ? కుట్టడానికి అవసరమైన సామాగ్రి అందుబాటులో పెట్టుకునేలా అధికారులు టైలర్లకు ముందస్తు సమాచారం ఇవ్వాలని తెలిపారు. కుట్టు మిషన్లు చెడిపోతే వెంటనే మరమ్మతు చేసేందుకు ఒక మెకానిక్ ను అందుబాటులో ఉంచాలని డిఆర్డిఓ రాజేశ్వరికి కలెక్టర్ సూచించారు. పాఠశాలలు పున:ప్రారంభమయ్యేలోపు విద్యార్థులకు ఇచ్చేందుకు యూనిఫాంలను సిద్ధం చేయాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదన కలెక్టర్ మాయాంక్ మిత్తల్ డి ఆర్ డి ఓ రాజేశ్వరి, అడిషనల్ డిఆర్డిఓ అంజయ్య, విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, జిల్లాకు చెందిన ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

**ఈనెల 17 నుంచి 31 వరకు జిల్లాలో వర్షాలు :**

ఈనెల 17 నుండి 31 వరకు తెలంగాణ అంతట ప్రత్యేకించి నారాయణపేట జిల్లాలో కూడా తేలికపాటి వర్షాలు మరియు ఉరుములతో కూడిన జల్లులు కురిసే అవకాశం ఉందని జిల్లా కలెక్టర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు పండించిన వరి గింజలను తడిసిపోని విధంగా నిలువ చేసుకోవాలని, వరి గింజలను కప్పడానికి టర్పీన్లను ఉపయోగించాలన్నారు.

# పేటలో జాతీయ డెంగ్యూ దినోత్సవం.



**నారాయణపేట టౌన్, మే 16 మనసాక్షి :-**

జాతీయ డెంగ్యూ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని పట్టణం లో డి ఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ సౌభాగ్య లక్ష్మి ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డి ఎం అండ్ హెచ్ ఓ జెండా ఊపి ర్యాలీ ప్రారంభించారు. డిఎమ్ అండ్ హెచ్ ఓ డాక్టర్ సౌభాగ్య లక్ష్మిమాట్లాడుతూ డెంగ్యూ వ్యాధి దోమల వల్ల వచ్చే వ్యాధి అని ఈ వ్యాధి వల్ల మానవునికి ప్రాణాపాయ స్థితి కలిగే అవకాశం ఎక్కువగా ఉంటుంది కాబట్టి ఇంటి ఆవరణ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని నీరు నిలువ ఉండకుండా దోమలు పెరగకుండా తగు చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇట్టి కార్యక్రమంలో డిప్యూటీ డిఎం అండ్ హెచ్ ఓ డాక్టర్ శైలజ, జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ రాఘవేంద్ర, డాక్టర్ బాలాజీ సింగాడే, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ నరసింహారావు సగరి, వైద్య ఆరోగ్య సిబ్బంది మరియు ఏఎన్ఎమ్ లు, ల్యాబ్ టెక్నీషియన్లు ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

# డెంగ్యూ నివారణ దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ

**ధర్మపురి మే 16,మన సాక్షి**



ఎండపల్లి, మండలం అంబారి పేటలో జిల్లా కలెక్టర్ మరియు జిల్లా వైద్యాధికారి ఆదేశాల మేరకు. గురువారం రోజున జాతీయ డెంగ్యూ దినోత్సవం సందర్భంగా. అంబరిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో జాతీయ డెంగ్యు నివారణ పై అవగాహన ర్యాలీ నిర్వహించారు ఈ సందర్భంగా డాక్టర్ లవ కుమార్ మాట్లాడుతూ డెంగ్యు అనేది ఎడిస్ ఈజిప్ట్ దోమ మధ్యాహ్న సమయంలో కుట్టడం ద్వారా డెంగ్యూ వ్యాపిస్తుందని తద్వారా తీవ్రమైన తలనొప్పి జ్వరం ఉంటుందని శరీరంపై దద్దుర్లు వస్తాయని కండరాల నొప్పులు కీళ్ల నొప్పులు వచ్చి ఆకలి తగ్గుతుందన్నారు,డెంగీ రాకుండా ఉండాలంటే ప్రజలంతా ఇళ్ల పరిసరాల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం లేకుండా చూసుకోవాలన్నారు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని దోమల నివారణ తోనే డెంగ్యు నియంత్రణ సాధ్యమని అన్నారు ఈ కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ పి.లవకుమార్ , సూపర్వైజర్ రమణ వల్లి , ఎం ఎల్ హెచ్ పి గణేష్ మరియు రక్షిత .ఏఎన్ఎం లావణ్య బుచ్చమ్మ , చంద్రకళ ,విజయలక్ష్మి , సునీత ,వినోద ,మరియు హెల్త్ అసిస్టెంట్ శ్రీను ,మరియు ఆశా కార్యకర్తలు మరియు ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు

# నారాయణఖేడ్: సోషల్ మీడియా సమావేశం.. హాజరైన నేతలు




**కంగ్టి, మే 16, మన సాక్షి :-**

సీఎం రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా సోషల్ మీడియా సమావేశం నిర్వహించారు. సోషల్ మీడియా సమావేశానికి నారాయణఖేడ్ నుంచి జహీరాబాద్ పార్లమెంట్ అభ్యర్థి సురేష్ షెట్కర్, ఎమ్మెల్యే సంజీవరెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో-ఆర్డినేటర్లు తరలి వెళ్లారు. నారాయణఖేడ్ కో-ఆర్డినేటర్లు నాందీష్ (నందు), భూపాల్, విజయ్ -పెద్దశంకరంపేట, విజయ్ కుమార్ స్వామి-నాగల్ గిద్ద, ప్రకాష్ కంగ్రి, మూడ శ్రీను పాల్గొన్నారు.

# బీసీలకు రాజ్యాధికారంతోనే న్యాయం

**నిజామాబాద్:**బిసిలను అణగదొక్కుతూ ఇప్పటికీ అగ్రవర్ణాలే రాజ్యమేలుతున్నారని బీసీ సంక్షేమసంఘ నేతలు ఆరోపించారు. బీసీలకు సామాజిక భద్రత కల్పించడానికి ఎస్సీ,ఎస్టీ అట్రాసిటీ మాదిరిగా బీసీ యాక్టును తీసుకురావాలని డిమాండ్ చేశారు. అరవై ఏళ్ల స్వాతంత్య్రదేశంలో బీసీలకు అన్నివిధాలా అన్యాయం జరిగిందన్నారు. జనాభాప్రాతిపదికన బీసీలకు చట్టసభల్లో 50శాతం రిజర్వేషన్లు కల్పించాల్సిన అవసరముందని చెప్పారు. కొత్తగా ఏర్పడే పార్లమెంటులో బీసీలకు 50శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ బీసీబిల్లును పెట్టాలని అన్నారు. ముస్లింలకు బీసీలతో కాకుండా ప్రత్యేకకోటా ద్వారా రిజర్వేషన్లు వర్తింపజేయాలని సూచించారు. ఈమేరకు కేంద్రానికి నివేదించాలన్నారు. భారతదేశంలో అత్యధిక జనాభా కలిగిన బీసీలకు ప్రాధాన్యం ఇవ్వడంలేదని వాపోయారు.





## అంగరంగ వైభవం దర్గా ఉరుసు ఉత్సవ గంధం కార్యక్రమం

**రామసముద్రం,మే 16,మన సాక్షి:**

మండల కేంద్రంలోని దిన్నిపల్లె సమీపంలో ఉన్న గాంధీనగర్ లో ఉన్న శ్రీ హాజ్రత్ మాన్ ఫీర్ సయ్యద్ మస్తాన్ షా ఖాధారీ ఆరవ గంధం ఉరుసు గురువారం అంగరంగ వైభవంగా ఉరుసు ఉత్సవ కార్యాక్రమం విద్యుత్ కాంతుల నడుమ భక్తి శ్రద్ధలతో జరిగింది. ఈ వేడుక తిలకించడానికి కర్ణాటక, తమిళనాడు తెలంగాణ నుండి అధిక సంఖ్యలో వచ్చి ఉరుసు గంధం వీక్షించారు. ప్రత్యేకంగా మైసూర్ బృందం వారిచే గొప్ప కావ్వాలీ జరిగింది .ఈకార్యక్రమంలో మన్ ఫీర్ సయ్యద్ బృహన్ షా ఖాదరీ (మైసూర్ )మన్ ఫీర్ సయ్యద్ గౌస్ షా ఖాదరీ (బాబు)ఆఫీషా ఖాధారీ సయ్యద్ షా కమిటీ సభ్యులు (మైసూర్ )సయ్యద్ బాబా, ఇమ్రాన్ షా ఖాదరీ, హాజ్రత్ హాజ్జుర్ షా ఖాదరీ, తోషిఫ్ ఖాదరీ, మండలకాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఖాదర్ బాషా దర్గా కమిటీ సభ్యులు హిందూ ముస్లిం సోదరులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. దర్గా కమిటీ సభ్యులుమరియు కుటుంబసభ్యులు ఆధ్వర్యంలో గొప్ప అన్నదానం కార్యక్రమం నిర్వహించడం జరిగింది.

## వైభవంగా దిగువ బండమ్మ అమ్మవారి రాథోత్సవం

**రామసముద్రం మే 16 మనసాక్షి**



రామసముద్రం మండలం కాప్పల్లె పంచాయతీ గజ్జలవారి పల్లె గ్రామం లో వెలిసిన దిగువ బండమ్మ అమ్మవారి రాథోత్సవ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు.అమ్మవారిని పలు రకాల పుష్పలతో అలంకరణ చేసి రథంలో ఉంచి పురవీదుల్లో ఊరేగింపు జరిగింది. రథోత్సవం తిలకించడానికి భక్తులు అధికసంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు.కోవా కృష్ణమూర్ధి వారి ఫ్యామిలీ రాథోత్సవం ను తిలకించడానికి వచ్చిన భక్తులకు ప్రసాదాలు అందజేశారు.
ఈకార్యక్రమంలో అర్చకులు, కార్యానిర్వాహుకులు అశేష భక్తజనం పాల్గొన్నారు.అలాగే చెంబకూరు గ్రామానికి చెందిన బ్రాహ్మణులను, క్షత్రియులను,రెడ్లను గ్రామ పెద్దలను ఘన సన్మానించడం జరిగింది

## దోమలు పుట్టకుండా నివారిద్దాం




**దంతాలపల్లి మే 16 ,మన సాక్షి,**

పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమలు పుట్టకుండా ,కుట్టకుండా, చేయవచ్చునని స్థానిక వైద్యాధికారి డాక్టర్ చైతన్య తెలిపారు. గురువారం జాతీయ డెంగ్యూ దినోత్సవం పురస్కరించుకొని స్థానిక వైద్య సిబ్బందితో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఏడిస్ దోమ వలన డెంగ్యూ వ్యాధి వస్తుందని , ఈ దోమ మంచినీటిలో పెరుగుతుందని మధ్యాహ్నం టైం లో మాత్రమే కుట్టడం వలన డెంగ్యూ వ్యాధి వస్తుందని తెలిపారు. డెంగ్యూ వ్యాధి నిర్మూలన కోసం ప్రజలు ప్రతి శుక్రవారం మంగళవారం డ్రై డే ని పాటించడం ద్వారా డెంగ్యూ వ్యాధిని నిర్మూలించవచ్చని ఆమె తెలిపారు. ఇంటి పరిసర ప్రాంతాలలో మురికిగుంటలు లేకుండా చూసుకోవాలని ప్రజలకు పిలుపునిచ్చారు. వర్షాకాలంలో కీటక జనిత వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సిహెచ్ ఓ బాలాజీ, డాక్టర్ చందు ,డాక్టర్ వాణి, డాక్టర్ అనూష, సూపర్వైజర్లు రమణ ,సుజాత హెల్త్ అసిస్టెంట్లు సత్యనారాయణ, శ్రీను ,చలపతి, ఎం ఎల్ హెచ్ పి లు, వైద్య సిబ్బంది ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## అకాల వర్షం అన్నదాతకు తీవ్ర నష్టం

**కొల్చారం, మే 16, మన సాక్షి**



ఆరుగాలాల పాటు ఎంతో కష్టపడి శ్రమించిన రైతన్నకు అకాల వర్షం కంఠతది మిగిల్చింది. గురువారం మధ్యాహ్నం కొల్చారం మండలంలోని పలు గ్రామాలలో కురిసిన అకాల వర్షానికి వరి ధాన్యం కుప్పలు తడిసిపోయాయి. గత కొన్ని రోజులుగా కొనుగోలు కేంద్రాలకు లారీలు రాకపోవడంతో ధాన్యం తూకం జరగడం లేదు. దీంతో తుక్కాపూర్, రంగంపేట్, కొనపూర్ తదితర గ్రామాలలో దాన్యం రాశులు ఎక్కడికి అక్కడ నిలిచిపోయాయి తూకం వేసిన బస్తాలు సైతం రైస్ మిల్లులకు తరలించకపోవడంతో కొనుగోలు కేంద్రాల్లోనే ఉండిపోయాయి గురువారం మధ్యాహ్నం సమయంలో కుర్సిన అకాల వర్షాలకు తూకం వేసిన ధాన్యం బస్తాలు ఆరబోసిన ధాన్యం రాశుల్లోకి వరద నీరు చేరడం తో తడిసిపోయాయి. తడిసిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసేలా అధికారులు చర్యలు చేపట్టాలని , తుకం వేసిన ధాన్యాన్ని వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా అధికారులు చర్యలు చేపట్టాలని మండలంలోని వివిధ గ్రామాల రైతుల కోరుతున్నారు.

# ఎంపీ ఎన్నికల్లో బిఆర్ఎస్ విజయం ఖాయం.

**-మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు కృష్ణ యాదవ్**

**గజ్వేల్,మే,16,మనసాక్షి**



గత సోమవారం జరిగిన లోక్ సభ ఎన్నికల్లో మెదక్ పార్లమెంట్ పరిధిలో బిఆర్ఎస్ పార్టీ అభ్యర్థి మాజీ కలెక్టర్ ఎమ్మెల్సీ వెంకట్రాంరెడ్డి లక్ష పైచిలుకు మెజారిటీతో విజయం సాధించనున్నారని, మండల ఎంపిటిసిల ఫోరం అధ్యక్షులు,కృష్ణ యాదవ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం ఆయన మండల కోఆప్షన్ సభ్యులు లక్కాకుల సాహేర నరేష్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు తుమ్మల కనకయ్యలతో కలిసి మీడియా సమావేశంలో మాట్లాడుతూ లోకసభ ఎన్నికల ప్రచారం ప్రారంభమైన నాటి నుండి పార్టీ శ్రేణులంతా క్షేత్రస్థాయిలో విస్తృతంగా ప్రచారం చేసామని,నిద్రాహారాలు మాని బిఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం కష్టపడ్డామన్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీల విధానాలపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని,తమ ప్రభుత్వ హయంలో పది లక్షలకు పైగా మంది లబ్ధిదారులు వివిధ పథకాల ఫలాలు పొందారని తెలిపారు. వారిలో ఎక్కువ శాతం మంది కారు గుర్తుకే ఓటు వేశారని,సైలెంట్ ఓటింగ్ పెద్ద ఎత్తున జరగడంతో బిఆర్ఎస్ సునాయాసంగా విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్,బీజేపీ పార్టీలు ఎన్ని మాయ మాటలు చెప్పిన ప్రజలు తమ వైపే ఉన్నారని కాంగ్రెస్ పార్టీ హామీల అమలులో విఫలమయినందున ప్రజలంతా తీవ్ర అసంతృప్తితో ఉన్నారని అన్నారు. రైతు బంధు,రైతు బీమా,కళ్యాణ లక్ష్మి,పెన్షన్ల పంపిణి వంటి పథకాల అమలులో ప్రభుత్వం విఫలమయిందని ఆక్షేపించారు. అటు కేంద్రంలోని బిజేపీతో మెదక్ పార్లమెంట్ పరిధిలో ఎటు వంటి అభివృద్ధి జరగలేదని దుయ్యబట్టారు. కాంగ్రెస్, బీజేపీలపై ఉన్న వ్యతిరేకత తమకు సానుకూలంగా మారిందని విశ్లేషించారు. సోమవారం జరిగిన లోకసభ ఎన్నికల పోలింగ్ సమయంలో పాములపర్తి గ్రామంలో ఇద్దరి వ్యక్తుల మధ్య జరిగిన ఘర్షణను బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేపిచ్చారని ఆరోపించడం సరికాదని బిజెపి నాయకులు చిన్న విషయాన్ని రాజకీయం చేయడం మానుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు తదితరులు ఉన్నారు.

# రైతు వ్యతిరేక పార్టీ కాంగ్రెస్

**మహేశ్వరం,మే 16, (మన సాక్షి )**




**రైతుల బాధ ఆవేదన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అర్థం కాదా...**
**మహేశ్వరం రైతు ధర్నా కార్యక్రమంలో మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి**

రైతులకు అండగా బిఆర్ఎస్ పార్టీ ఉంటుందని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. తెలంగాణ రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి మోసం చేసిన రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక చర్యలకు నిరసనగా మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పిలుపు మేరకు గురువారం నాడు మహేశ్వరం నియోజకవర్గం శ్రీశైలం జాతీయ రహదారిపై బారీ ఎత్తున ధర్నా కార్యక్రమం నిర్వహించారు. ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సబితమ్మ మాట్లాడుతూ రైతులకు 500 బోనస్ ఇచ్చి ధాన్యం కొనుగోలు చేయాలని తెలంగాణ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మాట ఇచ్చినా రేవంత్ రెడ్డి ఎందుకు అమలు చేయడం లేదని ప్రశ్నించారు. రైతుల పట్ల కాంగ్రెస్ పార్టీ చిన్న చూపు చూస్తుందని సబితమ్మ విమర్శించారు. రైతుల ఇబ్బందులు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టదా అని ప్రశ్నించారు. బిఆర్ఎస్ పార్టీ రైతు సంక్షేమానికి రైతుల కోసం పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని ధాన్యం కొనుగోలు చేసే వరకు టిఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని సబితమ్మ అన్నారు. పార్లమెంటు ఎన్నికలు ముగిసిన తెల్లారే వరి ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ చెల్లిస్తానని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి.. ఇప్పుడు సన్న వడ్ల కు మాత్రమే బోనస్ ఇస్తామనడం రాష్ట్ర రైతాంగాన్ని మరోసారి వంచించడం, మోసం చేయడం, దగా చేయడమేనని సబితా ఇంద్రారెడ్డి పేర్కొన్నారు.
"రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం ఇట్లా ఎట్లా ప్రకటిస్తది.?" అని ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వంచించింద"న్నారు. ఓట్లు డబ్బాలో పడంగనే కాంగ్రెస్ వాళ్లకు రైతుల అవసరం తీరింది. అందుకే నాలిక మల్లేసి ఎప్పటి మాదిరిగానే నయవంచనకు పూనుకున్నారు. ఇదే సన్న వడ్లకు మాత్రమే అనే మాట ఎన్నికలకు ముందు గనుక చెప్పింటే కాంగ్రెస్ పార్టీని రైతులు తుక్కు తుక్కు చేసేవాళ్లు. ఇప్పటికీ ప్రజలు ఆగ్రహంతోనే ఉన్నారు. రైతు బంధు ఇయ్యక, రైతు భరోసా ఇయ్యకుండా రైతాంగాన్ని అన్నిరకాలుగా కాంగ్రెస్ పార్టీ మోసం చేస్తుందని బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు రైతులపక్షాన నిలబడి కొట్లాడాలని పిలుపునిచ్చారు. ఇప్పటికీ కొనుగోలు కేంద్రాల్లో వడ్లను కొనడానికి నిర్లక్ష్యం వహిస్తూ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం ఏడిపిస్తూ గోస పుచ్చుకుంటున్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మహేశ్వరం ఎమ్మార్వో కార్యాలయంలో రైతుల పండించిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలని వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ సురేందర్ రెడ్డి,
పిఎసిఎస్ చైర్మన్ చంద్రశేఖర్ , పాండు యాదవ్,సీనియర్ నాయకులు చిలకమర్రి నర్సింహా, చంద్రయ్య,కర్రోళ్ల చంద్రయ్య, అంబయ్య, అరవింద్ శర్మ, వర్కింగ్ ప్రెసిడెంట్ యాదగిరి గౌడ్,కామేష్ రెడ్డి, దిద్దల అశోక్, బంటు రమేష్, కడమోని ప్రభాకర్ , పోల్కం బాలయ్య, సమీర్,తదితరులు పాల్గొన్నారు.

# పరిశుభ్రతతోనే వ్యాధులు దూరం

**-బి.శ్రీనివాస్ సబ్ యూనిట్ ఆఫీసర్ గజ్వేల్**

**గజ్వేల్,మే,16,మన సాక్షి**




సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలో జాతీయ డెంగ్యూ నివారణ దినోత్సవ సందర్భంగా డిస్ట్రిక్ట్ హాస్పిటల్.మాత శిశు సంరక్షణ కేంద్రం గజ్వేల్ నందు డెంగ్యూ నివారణ అవగాహన ర్యాలీ నిర్వహించడం మరియు ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఈ కార్యక్రమంలో గజ్వేల్ సబ్ యూనిట్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తద్వారా రోగాలు దరిచేరవని,మన ఇంటిని ఎంత శుభ్రంగా ఉంచుకుంటామో మన ఇంటి పరిసరాలు కూడా అంతే శుభ్రంగా ఉంచుకోవాలని నీటి నిలువ లేకుండా చూసుకోవాలని దోమలు వ్యాప్తిని అరికట్టాలని ఒక చిన్న దోమ,ఒక పెద్ద పెను ప్రమాదంగా మారుతుందని అనేక రకాలైనటువంటి వ్యాధులు సంక్రమిస్తాయని మలేరియా,ఫైలేరియా, డెంగ్యూ,చికెన్ గునియా లాంటి వ్యాధులు వ్యాపిస్తాయని ఇంట్లో పనికిరాని వస్తువులను మన ఇంటి పరిసరాలలో నీటి నిల్వ కుళాయిలను కొబ్బరిచిప్పలను తొట్టిలను ఎయిర్ కూలల్లోని నీటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని సూచించారు. ముఖ్యంగా మనం నిద్రిస్తున్న సమయంలో ఆల్ అవుట్లు వొడమసు లాంటి క్రిములను వాడి దోమల నుండి రక్షణ పొందాలన్నారు. తర్వాత అందరి చేత దేవసాని వాసుదేవ్ ప్రతిజ్ఞ చేయించారు. నేను నా ఇంట్లో వారందరూ కలిసి ఇంటిలో ఇంటి పరిసరాలను పరిశుభ్రతగా నీటి నిల్వ లేకుండా జాగ్రత్త తీసుకుంటానని దోమలు వ్యాధి అరికట్టడమే కాకుండా మలేరియా డెంగ్యూ చికెన్ గునియా తదితర వ్యాధుల నుండి మరియు నన్ను నేను దోమ కాటు నుండి రక్షించుకొనుటకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటానని సమాజంతో మమేకమై డెంగ్యూ వ్యాధి నియంత్రణకు పాటుపడతారని ప్రతిజ్ఞ చేయుచున్నాను. ఈ కార్యక్రమంలో దేవసాని వాసుదేవ్.బి.రాము ల్యాబ్ టెక్నీషియన్ శశి ఫార్మసిస్ట్. దుర్గా బాయ్,లక్ష్మి ,జ్యోతి, నర్సింగ్ ఆఫీసర్లు రేణుక, నాగమణి,కల్పనా,జ్యోతి, రేష్మ ఆశ వర్కర్లు మరియు పారామెడికల్ సిబ్బంది పాల్గొన్నారు.

# క్రిమి సంహారక మందు తాగి వ్యక్తి మృతి

**ధర్మపురి మే 16,మన సాక్షి**

ఎండపల్లి మండలం లో క్రిమి సంహారక మందు తాగి వ్యక్తి మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది ఎస్సై ఉమా సాగర్ తెలిపిన వివరాల ప్రకారం మండలం లోని ఆంబారిపేట గ్రామానికి చెందిన మోతే రాయ లింగయ్య తండ్రి నరసయ్య,వయసు 80 సంవత్సరాలు ,కలిగి ఉన్న ఇతడు గత కొన్ని నెలల నుండి కిడ్నీ ఫెయిల్యూర్, గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతూ ,బాధను భరించ లేక బుధవారం రాత్రి 11 గంటలకు ఏదో క్రిమి సంహారక మందు తాగి మృతి చెందాడని మృతుని కొడుకు మోతే రాజయ్య, ఇచ్చిన పిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు



# డెంగ్యూ రహిత సమాజ స్థాపనే ధ్యేయం..!







## సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి
## డీఎంహెచ్ఓ డాక్టర్ పుట్ల శ్రీనివాస్

**దుబ్బాక, మే 16, మనసాక్షి :**

డెంగ్యూ రహిత సమాజ స్థాపనే ధ్యేయంగా వైద్యాఆరోగ్య శాఖ పని చేస్తుందని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పుట్ల శ్రీనివాస్ అన్నారు. గురువారం జాతీయ డెంగ్యూ నిర్మూలన దినోత్సవం సందర్భంగా వైద్య సిబ్బందితో ఏర్పాటు చేసిన అవగాహన సమావేశంలో పాల్గొని మాట్లాడారు... దోమలతో వచ్చే వ్యాధుల పై ప్రజలకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. అవగాహన తోనే వ్యాధులు రాకుండా అడ్డుకోవచని తెలిపారు. సీజనల్ వ్యాధుల పట్ల ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రణాళిక బద్ధంగా వైద్య సేవలు అందించాలన్నారు. క్షేత స్థాయిలో పని చేసే సిబ్బంది ఎప్పటికపుడు విజిట్స్ చేయాలన్నారు. దోమల వల్ల వచ్చే వ్యాధులను ప్రజలకు వివరిస్తూ ఇంటి పరిసరాల్లో పరిశుభ్రత పాటించెలా చర్యలు చేపట్టాలన్నారు. డెంగ్యూ కేవలం మంచినీటి నిల్వలో వృద్ధి చెందుతున్న విషయం చెప్పాలన్నారు. కొబ్బరి చిప్పలు, కులర్స్, ఇంటిలో నీటి నిల్వలు లేకుండా ప్రతి శుక్రవారం డ్రైడే నిర్వహించేలా చూడాలన్నారు. సమాజంలో ఇప్పుడు మార్పు అవసరం ఉందని తెలిపారు. మన చుట్టుపక్కల శుభ్రత పాటిస్తూ పక్క వాళ్ళు పాటించేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా కీటక జనిత సిబ్బందిచే ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం డెంగ్యూ అవగాహన ర్యాలీ జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ విజయా రాణి,డాక్టర్ శ్రీదేవి,డాక్టర్ రజని, డాక్టర్ శ్రీకాంత్,పిహెచ్ సి వైద్యాధికారులు డాక్టర్ ప్రవీణ్ నాయక్, గట్ల మల్యాల వైద్యాధికారిపిహెచ్ సి డాక్టర్ అంజలి రెడ్డి, డిఎంహెచ్ ఓ సీసీ డానియల్, డెమో నవిన్ రాజ్ కుమార్, ఎన్ విబిడిసిపి హెచ్ఇఓ గాలి రమేశ్, పిహెచ్ సి హెచ్ఇఓ స్వామి, కొండయ్య, సిహెచ్ఓ లు ఫైలేరియా, మలేరియా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# వరి ధాన్యం సేకరణ లక్ష్యాన్ని చేరుకోవాలి.

## -జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష.

**నారాయణపేట టౌన్, మే 16 మనసాక్షి :-**



ప్రభుత్వం జిల్లాకు నిర్దేశించిన వరి ధాన్యం సేకరణ లక్ష్యాన్ని చేరుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆదేశించారు. జిల్లాలో వరి కొనుగోలు కేంద్రాల ద్వారా ఇప్పటి వరకు ఎన్ని మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించారని? ఇంకా ఎంత సేకరించాల్సి ఉందని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఐకెపి, పీ ఎస్ ఈ ఎస్, మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల టార్గెట్ ను పూర్తి చేయాలని సూచించారు. గురువారం కలెక్టరేట్ లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ లో వరి ధాన్యం సేకరణ – నిర్దేశించిన లక్ష్యం పై కలెక్టర్ సివిల్ సప్లై, డీ ఆర్ డి ఏ, పి ఎస్ ఈ ఎస్, మార్కెటింగ్ శాఖ అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కేంద్రాల వారీగా టార్గెట్ పూర్తయితే ఆయా కేంద్రాలను మూసేయాలని చెప్పారు. అయితే జిల్లాలో ఇంకా 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం వస్తుందని జిల్లా వ్యవసాయ అధికారి జాన్ సుధాకర్ కలెక్టర్ కు తెలిపారు. మద్దూరు, కోస్గి మండలాల నుంచి కూడా ఇంకా ధాన్యం రావాల్సి ఉందని వ్యవసాయాధికారి చెప్పారు. ప్రస్తుతం వర్షాలు కురిసే అవకాశం ఉందని, రైతుల కు అవసరమైన టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. కొనుగోలు కేంద్రాలకు ఇచ్చిన తేమ శాతం యంత్రాలు, టార్పాలిన్ల ను కేంద్రాలు మూసిన తర్వాత తిరిగి తీసుకోవాలని జిల్లా మార్కెటింగ్ అధికారి బాలామణి ని కలెక్టర్ ఆదేశించారు. ప్రతీ సారి కొనుగోలు కేంద్రాల కోసం కొత్త తేమ శాతం యంత్రాలు, టార్పాలిన్ల ను కొనుగోలు చేయాల్సి వస్తుందని, ఈ సారి కేంద్రాలు మూసిన వెంటనే వాటిని తప్పనిసరిగా కేంద్రాల నిర్వహకులకు ఫోన్లు చేసి తిరిగి తీసుకోవాలన్నారు. రైస్ మిల్లర్ల సిఎంఆర్ లక్ష్యం ఎంత వరకు వచ్చిందని ప్రశ్నించారు. నిర్లక్ష్యం చేసే రైస్ మిల్లర్లపై చర్యలు తీసుకోవాలని సివిల్ సప్లై అధికారులను ఆదేశించారు. సిఎంఆర్ బియ్యానికి సంబంధించి పది శాతం కంటే తక్కువ ఏ సి కె ఉన్న రైస్ మిల్లర్లకు నోటీసులు ఇవ్వాలని సివిల్ సప్లై అధికారులకు కలెక్టర్ సూచించారు. సమావేశంలో సివిల్ సప్లై డిఎం దేవదాస్, డీఎస్ఓ సుదర్శన్, డిఆర్డిఓ రాజేశ్వరి, డీటీ కాళప్ప తదితరులు పాల్గొన్నారు.

# దొడ్డు వడ్లకు రూ.500 బోనస్ ఇవ్వాలి

## -మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి

**గజ్వేల్,మే,16,మన సాక్షి**



సిద్ధిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలో మాజీ ముఖ్యమంత్రివర్యులు కల్వకుంట్ల చంద్రశేఖర రావు ఆదేశాల మేరకు రైతులు పండించిన సన్న వడ్లకు దొడ్డు వడ్లకు 500 బోనస్ వెంటనే రైతుల ఖాతాలో జమ చేయాలని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ గజ్వేల్ లోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మాజీ ఎఫ్ డి సి చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ ఎత్తున రైతులతో కలిసి ధర్నా చేయడం జరిగింది. ఈ సందర్భంగా వంటేరు ప్రతాప్ రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు హామీలతో అసత్యపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తూ రైతుల యొక్క నడ్డి విరిచే ప్రయత్నాన్ని చేస్తుందన్నారు,కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు రైతులకు గిట్టుబాటు ధరలను కల్పిస్తూ వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, దానితోపాటు ప్రత్యేకంగా ప్రతి క్వింటాల్ వరి ధాన్యానికి 500 బోనస్ ను ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ దానిని బోగస్ వాగ్దానంగా మార్చి తప్పించుకుంటుందని మండిపడ్డారు,కాంగ్రెస్ వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు పెరిగాయన్నారు,కాంగ్రెస్ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కరువు ఏర్పడిందన్నారు,కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కరెంటు రాక బోరు మోటర్లు కాలిపోతున్నాయన్నారు. ట్రాన్స్ఫార్మర్లు పేలిపోతున్నాయన్నారు, కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల కరెంటు ఎనిమిది తొమ్మిది గంటలకు మాత్రమే పరిమితమైందన్నారు,కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని చెరువులు కుంటలు చెక్ డ్యాములు ప్రాజెక్టులు ఎడారులుగా మారాయి అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీళ్లు లేక రైతుల యొక్క పంట పొలాలు ఎండిపోయాయన్నారు. త్రాగునీటి సమస్య ఏర్పడింది అన్నారు,

కాంగ్రెస్ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రం యొక్క ఆర్థిక వ్యవస్థ దిగజారింది అన్నారు,కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసపూరిత హామీలు అబద్ధపు వాగ్దానాలు మోసపూరిత కుట్రలు అన్నారు,రైతులు పండించిన ప్రతి గింజను గిట్టుబాటు ధరలను కల్పిస్తూ కొనుగోలు చేయాలన్నారు, సన్న వరి ధాన్యానికి ప్రైవేటు రైస్ మిల్లు వారు 2700 పెట్టి సన్నధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు,కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం రైతులకు ఇవ్వాల్సిన బోనస్ ను కూడా ఇవ్వడం లేదని,ఆవేదన వ్యక్తం చేశారు.తెలంగాణ రాష్ట్రం సాధించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వ హయాంలో కాలేశ్వరం లాంటి ప్రాజెక్టులను నిర్మాణం చేసి కొండపోచమ్మ,మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ లాంటి ఎన్నో రకాల ప్రాజెక్టుల నిర్మాణం చేసి ఎడారిగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పాడి పంటలతో ఆకుపచ్చ తెలంగాణగా మార్చిన ఘనత కేసిఆర్ ది మాత్రమే అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పుష్కలంగా ఎటుచూసిన మిషన్ భగీరథ ద్వారా 13 వేల చెరువులు నిండుకుండల, ఉన్నాయన్నారు.ప్రాజెక్టుల ద్వారా కెనాల్ ల ద్వారా చెరువులను కుంటలను నింపి మండుటెండల్లో సైతం రైతుల పొలాలకు గోదావరి జలాలను అందించిన ఘనత కేసీఆర్ దే అన్నారు.రైతులకు 24 గంటలు ఉచిత కరెంటు అందించిన ఘనత,రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించిన ఘనత,రైతులకు సకాలంలో యూరియా విత్తనాలు అందించిన ఘనత,రైతులకు సకాలంలో ప్రతి ఎకరానికి 10000 పెట్టుబడి అందించిన ఘనత,రైతులకు రైతు బీమా కల్పించిన రైతు బీమా కల్పించిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి రైతులను రాజులను చేసిన ఘనత, కేసిఆర్ దే,కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను బిచ్చగాళ్లను చేసిందన్నారు. రైతులను అప్పుల ఊబిలో కూర్కుపోయేటట్టు కాంగ్రెస్ పార్టీ విధానాలు ఉన్నాయన్నారు రైతు రుణమాఫీ చేయలేదన్నారు, గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు లేవన్నారు.తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉందన్నారు,సబ్బండ వర్గాలు సుభిక్షంగా ఉన్నాయన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అసత్యపు వాగ్దానాలతో గద్దెనెక్కి ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కిందన్నారు.మహిళా భరోసా లేదన్నారు,రుణమాఫీ చేయలేదన్నారు,మహిళకు 2500 ఇవ్వడం లేదన్నారు, పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎలాంటి ఉద్యమం జరిగిందో మళ్లీ ప్రజల పక్షాన పోరాటం ప్రారంభించడం జరుగుతుందన్నారు.కేసీఆర్ కు ఉద్యమాలు పోరాటాలు కొత్తవి కావన్నారు.ఈ కార్యక్రమంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ ఎన్.సి రాజమౌళి,వైస్ చైర్మన్ జాక్కి యుద్దీన్,మాజీ ఆత్మ కమిటీ చైర్మన్ వుడెం కృష్ణారెడ్డి, కౌన్సిలర్లు గోపాల్ రెడ్డి, బబ్బురి రజిత,గంగిశెట్టి రవీందర్,అరుణ భూపాల్ రెడ్డి,మద్ది రాజిరెడ్డి,శ్రీనివాస్ రెడ్డి,మరికంటి కనకయ్య, రైతులు బిఆర్ఎస్ పార్టీ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులున్నారు.

# ఆలయ ప్రాంగణంలో సర్పాల సయ్యాట..!

**కంగ్టి, మే 16, మన సాక్షి :-**



సంగారెడ్డి జిల్లా కంగ్టి మండల కేంద్రంలోని శ్రీ సిద్దేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం సాయంత్రం రెండు సర్పాలు (నాగుపాము) సయ్యాటలాడాయి. స్థానిక ఆలయానికి దర్శనం కోసం వచ్చిన భక్తులు సర్పాల సయ్యాటను వింతగా చేశారు. వేసవి ఎండ తీవ్రత నుండి వాతావరణంలో మార్పులు చోటు చేసుకొని చల్లబడడంతో సర్పాలు అలా బయటకొచ్చి ఉపశమనం పొందుతూ సయ్యాటలు ఆడతాయని స్థానికులు తెలిపారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి శ్రీ సత్యసాయి సేవా సమితి చేయూత

**జగిత్యాల జిల్లా ప్రతినిధి,మే16,(మన సాక్షి)**



జగిత్యాల పట్టణంలో బుడగ జంగాల కాలానికి చెందిన నూనె తిరుపతి కి రెండు కిడ్నీలు పాడయిపోయాయి, కిడ్నీ మార్పిడి చేయాలనీ డాక్టర్లు చెప్పడం తో తన భార్య తన కిడ్నీ ఇవ్వడానికి సిద్ధమయ్యింది, ప్రభుత్వం నుండి ఆపరేషన్ ఖర్చు మంజూరు అయినప్పటికీ, ఇతర ఖర్చులకు, హైదరాబాద్ హాస్పిటల్ లో 2 నెలలు ఉండవలసి ఉన్నందున, దాదాపు ఇంకొక లక్ష రూపాయలపైన తనకు అవసరం కాగా, ఆర్థికంగా ఎటువంటి ఆధారం లేకపోవడంతో వారు సత్యసాయి సంస్థ సహకారాన్ని కోరగా భక్తుల సహకారంతో రూ. 19,100 ను గురువారం వారికి అందచేశారు.ఒక నెలకు కావలసిన బియ్యం తదితర నిత్యావసర వంట సరుకులని అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ కన్వీనర్ బట్టు రాజేందర్ , చిటుమల్ల లక్ష్మీనారాయణ, వూటూరి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# వాసవి మాత జీవిత చరిత్ర పారాయణం..

**- ప్రతి ఇంటికి పారాయణం చేరాలి**

**దుబ్బాక, మే 16, మనసాక్షి :**



ప్రతి ఇంటింటికి వాసవి మాత పారాయణం చేరాలని వాసవి పారాయణ ప్రచారకర్త , వాసవి పారాయణ ప్రచార సేవ సమితి వ్యవస్థాపకురాలు స్వరూప రాణి అన్నారు. గురువారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పారాయణ కార్యక్రమంలో భాగంగా గోపూజ, ఉత్సవమూర్తికి అభిషేకం ,వాసవి అష్టోత్తరంతో కుంకుమార్చన, వాసవి మాత పారాయణం, వాసవి మాత చరిత్ర ప్రవచనం నిర్వహించారు. ఈ సందర్భంగా జూలూరు స్వరూప రాణి మాట్లాడుతూ... వాసవి మాత పారాయణం మొదటిసారిగా ప్రారంభించి ఇప్పటి వరకు 102 వాసవి మాత దేవాలయలో వాసవి మాత పారాయణము నేటితో పూర్తి చేయడం జరిగిందని, వాసవి మాత పారాయణం ఇంటింటికి చేరాలని సదుద్దేశంతో నిర్వహించడం జరుగుతుందని అన్నారు . ఈ కార్యక్రమంలో సిద్దిపేట పట్టణ ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు పుల్లురి సుష్మ,వాసవి వనిత క్లబ్ అధ్యక్షురాలు మర్యాల వాణ్ణి, నాగమల్ల సంధ్య , లావణ్య కొండ స్వరూపరాణి గట్టు అరుణ , అరుణ వనిత క్లబ్ పి ఆర్ ఓ సోమ మంజుల, మహిళలు క్లబ్ సభ్యులు వైశ్య సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# వడ దెబ్బతో హమాలి కార్మికుడు మృతి. ?

**ధర్మపురి ,మే 16,మన సాక్షి**



వెల్గటూర్ మండలంలో వడ దెబ్బతో హమాలి కార్మికుడు మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ముత్తునూర్ గ్రామానికి చెందిన రైతు మోకెనపల్లి రాజయ్య వయసు 50 సంవత్సరాలు ఇతను గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం ఆద్వర్యంలో నిర్వహిస్తున్న వడ్ల కొనుగోలు కేంద్రంలో హమాలిగా పని చేస్తున్న క్రమంలో ఎండ తీవ్రత తట్టుకోలేక ఒక్కసారిగా అపస్మారక స్థితిలోకి వెళ్ళాడు. వెంటనే స్థానికులు దగ్గరలోని ఓ ప్రవేట్ ఆసుపత్రికి తరలించే క్రమంలోనే మృతి చెందినట్లు స్థానికులు తెలిపారు,మృతునికి ఇద్దరు కూతుళ్లు,ఒక కుమారుడు కలిగి ఉన్నారు.

# ధాన్యం నిల్వల పై సివిల్ సప్లై అధికారుల తనీఖీలు



**నేలకొండపల్లి, మే 16 మన సాక్షి:**

మండలం లోని ఓ వ్యాపారి ధాన్యం నిల్వల పై సివిల్ సప్లై అధికారులు గురువారం తనీఖీలు నిర్వహించారు. గ్రామానికి చెందిన వ్యాపారి కుటుంబం పెద్ద ఎత్తున నిబంధనలకు విరుద్ధంగా ధాన్యం నిల్వలు ఉంచారని అదే గ్రామానికి చెందిన పి. కృష్ణమూర్తి అనే రైతు జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కలెక్టర్ విచారణ కు ఆదేశించారు.'

గురువారం సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ మహ్మద్ అబ్దుల్ నిసార్, సివిల్ సప్లై రెవిన్యూ ఇన్స్పెక్టర్ నరేష్ లు ఆకస్మికంగా తనీఖీ చేశారు. సంబంధిత వ్యాపారుల వద్ద ఉన్న ధాన్యం ను స్టాక్ ను పరిశీలించారు. ఆ 1 ధాన్యం తమవి కాదని రైతులు అని సదరు వ్యాపారులు సమాధానం అందించారు. ఈ మేరకు గ్రామానికి చెందిన పలువురు రైతులు ఆ ధాన్యం బస్తాలు మావేనంటూ లిఖిత పూర్వకంగా వ్రాసి సివిల్ సప్లై అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయం పై డిప్యూటీ తహశీల్దార్ ను వివరణ కోరగా.... పిర్యాదు మేరకు తనీఖీలు నిర్వహించినటు.పేర్కొన్నారు. కాగా కొంత మంది రైతులు వచ్చి ఆ ధాన్యం తమేవని వ్రాసి ఇచ్చారని తెలిపారు. ఈ విషయం పై డీఎస్వో కు నివేదిక ను అందించనున్నట్లు తెలిపారు. ఫిర్యాదుదారుడు సదరు వ్యాపారుల పై వ్యవసాయ శాఖ మంత్రి, డీఎస్ వో కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సమగ్ర విచారణ చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

# వాసవి కుటుంబ సంరక్ష పథకం చెక్కుల పంపిణీ



**నల్లగొండ,మే 16,మన సాక్షి:**

వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ ఆధ్వర్యంలో అమలవుతున్న వాసవి కుటుంబ సురక్ష పథకం కింద వి 104 ఏ జిల్లాలో వాసవి క్లబ్ సీనియర్ సిటిజన్స్ కపుల్స్ నల్లగొండ క్లబ్ లో మృతి చెందినటువంటి సభ్యులు కుటుంబాలకు ఒక్కొక్కరికి 3,50,000/- రూపాయల చెక్కులను అందివ్వడం జరిగింది. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ అడ్మినిస్ట్రేటివ్ వైస్ ప్రెసిడెంట్ యమా దయాకర్, ఇంటర్నేషనల్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ మిట్టపల్లి రామన్న, ఇంటర్నేషనల్ అడిషనల్ ట్రెజరర్ కోటగిరి రామకృష్ణ, వాసవి కుటుంబ సంరక్ష పథకం జిల్లా ఇంచార్జ్ నూనే కిషోర్ కుమార్ ఇతర జిల్లా అధికారుల సమక్షంలో గురువారం చెక్కులను అందించారు .ఈ సందర్భంగా యామా దయాకర్ మిట్టపల్లి రామన్న మాట్లాడుతూ 2013 సంవత్సరములు అప్పటి అంతర్జాతీయ అధ్యక్షులు అయిత రాములు ప్రవేశపెట్టినట్టు ఇటువంటి వికేఎస్పి పథకంలో 5000 మందికి పైగా సభ్యులుగా చేరి వీరిలో ఎవరైనా మరణిస్తే వారి కుటుంబాలకు ఒక్కొక్కరు 100 రూపాయల చొప్పున అందజేసి చనిపోయిన సభ్యుని కుటుంబానికి ఆర్థికంగా చేయూతనందించే లక్ష్యంతో ఈ పథకం అమలు చేస్తున్నామని చెప్పారు .నల్లగొండ పట్టణంలో ఈ పథకం కింద ఇప్పటి వరకు సుమారు 30 మందికి పైగా లబ్ధి చేకూరినట్లు వివరించారు. జిల్లాలో ఉన్న వాసవియన్స్ అంతా సహకరించాలని వారు సూచించారు. సీనియర్ సిటిజన్స్ కపుల్స్ నల్లగొండ క్లబ్లో సభ్యులుగా ఉండి తాడిశెట్టి మల్లయ్య మంచుకొండ శోభారాణి వారి కుటుంబ సభ్యులకు చెక్కులు అందించడం జరిగింది.ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ ప్రోగ్రాం కోఆర్డినేటర్లు వీరెల్లి సతీష్ కుమార్, గుండా రమేష్ బాబు, క్లబ్బు అధ్యక్షులు గజ్వేల్లి సత్తయ్య సెక్రటరీ కోశాధికారి గజ్వేల్ యాదయ్య, మురారి శెట్టి కృష్ణమూర్తి,కలకొండ పెంటయ్య, సింగిరికొండ గోవర్ధన్, బిక్కుమల్ల రవీందర్ మరియు క్లబ్ సభ్యులు పాల్గొనడం జరిగింది.

# పట్టుదలతో పని చేస్తే విజయం మనదే



**ఉద్యోగులను,యువతను మోసం చేసింది కాంగ్రెస్**

**మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి**

**సూర్యాపేట,మే 16,మన సాక్షి:**

ఉద్యోగులు ,యువతను కాంగ్రెస్ ప్రభుత్వం దారుణంగా మోసం చేసిందని, మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలనే కృతనిచ్చయంతో యువత ఉద్యోగులు ఉన్నారని మాజీ మంత్రి సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. నల్గొండ- వరంగల్ ,ఖమ్మం ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి సూర్యాపేట జిల్లా పార్టీ కార్యాలయంలో జిల్లా ముఖ్య నేతలతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఎన్నికల ప్రచారం లో అనుసరించాల్సిన విధివిధానాలపై శ్రేణుల కు దిశా నిర్దేశం చేశారు. ప్రచారంలో ఓటర్లను కలుస్తున్న సందర్భంగా ప్రభుత్వం చేసిన మోసాన్ని నిరుద్యోగులు, యువత ఎండగడుతున్నారని తెలిపారు. బిఆర్ఎస్ అభ్యర్థి రాకేష్ రెడ్డి విజయానికి కావలసిన సానుకూల వాతావరణం నియోజకవర్గం లో ఉందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని సిద్ధంగా ఉన్న ,ప్రతి ఓటర్ ను కలావాలని సూచించారు. పార్లమెంటు ఎన్నికల తరహాలో వారం రోజులు బిఆర్ఎస్ శ్రేణులు ప్రజా క్షేత్రంలో కష్టపడి పని చేయాలని పిలుపునిచ్చారు. మన పని విధానమే మన విజయానికి నాంది అని తెలిపారు. సిట్టింగ్ స్థానాన్ని బి.ఆర్.ఎస్ నిలబెట్టుకోవడం ఖాయమన్నారు.ఈ సమావేశం లో రాజ్యసభ సభ్యులు బడుగుల లింగయ్య యాదవ్ తదితరులు పాలుగోన్నారు.

# వేతనాన్ని అందించిన శ్రీరంగం ఫౌండేషన్.

**కూకట్ పల్లి, మే 16 (మన సాక్షి ):**




కూకట్ పల్లి నియోజకవర్గం కేపీహెచ్ బి కాలనీలోని భువన విజయం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు మీనా రాజ కుమారి గతంలో ఇద్దరు ఉపాధ్యాయులకు మరియు పాఠశాలలోని తరగతి గదులు శుభ్రం చేసే వ్యక్తికి వేతనాన్ని ఇవ్వమని శ్రీరంగం ఫౌండేషన్ చైర్మన్ డా. సత్యం శ్రీరంగం ని కోరగా అందుకు శ్రీరంగం ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2023 -2024 విద్యా సంవత్సరం మొత్తం ప్రతి నెల వేతనాన్ని ఇస్తామని మాట ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం మే నెల వేతనాన్ని కూడా శ్రీరంగం ఫౌండేషన్ కో చైర్మన్ ఇందుమతి శ్రీరంగం చేతులమీదుగా వారి కార్యాలయంలో అందించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శ్రీరంగం ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# డాక్టరేట్ పొందిన వెంకటరత్నం.

**నేలకొండపల్లి, మే 16 మన సాక్షి:**



మండలం లోని చెన్నారం గ్రామానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్స్ బట్టపోతుల వెంకటరత్నం డాక్టరేట్ ను పొందారు. అగ్రికల్చర్ డేటా నుంచి తెగుళ్లను వర్గీకరించటానికి డిప్ లెర్నింగ్ టెక్నిక్స్ అనే అంశంపై అందించారు. ఈ మేరకు ఉస్మానియా యూనివర్శిటీ డాక్టరేట్ ను అందించారు. కంప్యూటర్ సైన్స్ మరియు ఇంజనీరింగ్ (ఇన్ఫర్మేటిక్స్) విభాగంలో పరిశోధనలు నిర్వహించారు. గైడ్ గా హైద్రాబాద్ కు చెందిన అసోసియేట్ ప్రొఫెసర్, సీబీఐటీ(ఐటీ) డాక్టర్.డి.లక్ష్మి శ్రీనివాస్ రెడ్డి వ్యవహరించారు. మారుమూల గ్రామంలో నిరుపేద కుటుంబం లోఫ్రాన్సిస్-రామలక్ష్మి దంపతులు వ్యవసాయ కూలీలు. వీరికి చదువు కూడ రాదు. కానీ కుమారుడు ఉన్నత చదువుల కోసం నిరంతర శ్రమించిన శ్రమజీవులు. ఈ సందర్భంగా కుమారుడు ను -పలువురు అభినందించారు.

# ఎమ్మెల్సీ ఎన్నికలు,గ్రూపు-1 పరీక్షలకు పటిష్ఠ ఏర్పాట్లు

**ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు**

**ఫ్లైయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ కొనసాగించాలి**





**సూర్యాపేట,మే 16,మన సాక్షి:**

ఈనెల 27వ తేదీన జరగనున్న వరంగల్, ఖమ్మం, నల్గొండ పట్టభద్రులపై ఎన్నికకు అలాగే జూన్ 9న జరిగే గ్రూపు-1 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ ఎస్ వెంకట్రావు తెలిపారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో నోడల్ అధికారులు, తాసిల్దారులు, ఆర్డీవోలు, జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో జిల్లా ఎస్పి రాహుల్ హెగ్డే ,జిల్లా అదనపు కలెక్టర్ లోకల్ బాడీ సిహెచ్ ప్రియాంకతో కలిసి కలెక్టర్ సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ నిర్వహణపై అధికారులకు కలెక్టర్ పలు ఆదేశాలు జారీ చేశారు. శాసనమండలి ఎన్నికలకు 52 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారని పట్టభద్రుల ఎన్నికల నిర్వహణకు 142 జంబో బ్యాలెట్ బాక్సులు శ్రీ సత్య సాయి జిల్లా నుండి తెప్పించడం జరుగుతుందని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల గాను సూర్యాపేటలో 31 పోలింగ్ కేంద్రాలు, కోదాడలో 22 పోలింగ్ కేంద్రాలు , హుజూర్నగర్లో 18 పోలింగ్ కేంద్రాలు మొత్తం 71 పోలింగ్ కేంద్రాలలో అని ఏర్పాట్లు చేస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మొత్తం 51,497 మంది పట్టభద్రులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని తెలిపారు.ఎన్నికల కోడ్ అమలులో ఉంటుందని తెలిపారు.(%టర్%) ఫ్లయింగ్ స్క్వాడ్ పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు. పోలింగ్ సిబ్బందికి మాస్టర్ ట్రైనర్ల చే సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు.జూన్ 9వ తేదీన జరిగే గ్రూప్-1 పరీక్షలకు జిల్లాలో 40 సెంటర్లలలొ నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. 9,744 మంది అభ్యర్థులు పరీక్షలు రాయనున్నారని కలెక్టర్ తెలిపారు. వీరికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని కలెక్టర్ అధికారులకు ఆదేశించారు. జిల్లా ఎస్పీ రాహుల్ అంటే మాట్లాడుతూ జిల్లాలో జరిగే గ్రూప్ -1 పరీక్షలకు అన్ని కేంద్రాలలో బందోబస్తుకు పోలీసు సిబ్బందిని కేటాయించినట్లు తెలిపారు పరీక్ష కేంద్రాలలోకి మొబైల్ ఫోన్స్ అనుమతి లేదని ,అన్ని కేంద్రాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్టీసీ, విద్యుత్ శాఖ, రోడ్లు భవనాల శాఖ, తమ పూర్తి సహకారం అందించాలన్నారు.పట్టబద్రుల ఎన్నికలలో ఎఫ్ఎస్టిలు పనిచేస్తాయని ఈ ఎన్నికలకు జిల్లా ఫోర్స్ నె ఏర్పాటు చేస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాన్ పవర్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్ వివి అప్పారావు ,బ్యాలెట్ బాక్సెస్ నోడల్ ఆఫీసర్ డిపిఓ సురేష్ కుమార్, ట్రైనింగ్ మేనేజ్మెంట్ నోడల్ ఆఫీసర్ శ్రీధర్ రెడ్డి ,పోస్టల్ బ్యాలెట్ నోడల్ ఆఫీసర్ మత్స్య శాఖ అధికారి రూపేందర్ సింగ్, వెహికల్, ట్రాన్స్పోర్ట్ నోడల్ అధికారి ఆర్టిఓ సురేష్ రెడ్డి ,ఎంసీసీ నోడల్ ఆఫీసర్ డిఎఫ్ఓ వి సతీష్ కుమార్, ఎక్స్పెండిచర్ మానిటరింగ్ నోడల్ ఆఫీసర్ ఎస్ పద్మ, ఎంసీఎంసీ నోడల్ ఆఫీసర్ డిపిఆర్ఓ ఏ రమేష్ కుమార్, ఎలక్ట్రో రోల్స్ మోడల్ ఆఫీసర్ శ్యాంసుందర్ ప్రసాద్, అబ్జర్వేషన్ మోడల్ ఆఫీసర్ లక్ష్మణ నాయక్, పిడబ్ల్యుడి నోడల్ ఆఫీసర్ వెంకటరమణ ,మాస్టర్ ట్రైనర్స్ వి రమేష్ ,వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ఎన్నికల సూపర్డెంట్ శ్రీనివాసరాజు, వేణు, రమేష్ ,గ్రూప్ వన్ పరీక్షల సూపరిండెంట్ పద్మారావు ,కలెక్టరేట్ ఏవో మందాడి సుదర్శన్ రెడ్డి, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# కాంగ్రెస్ తోనేరైతులకు మళ్ళీ పాత కష్టాలు వచ్చాయి..!

**దుబ్బాక, మే 16, మనసాక్షి :**



**పండని పంటకు సబ్సిడీ ఇస్తావా**

**కెసిఆర్ పాలనలో రైతుకు మేలు**

**కాంగ్రెస్ ను ఖగులో వేసి మూత పెడతారు**

**దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి**

కాంగ్రెస్ తోనే రైతులకు పాత కష్టాలు మళ్లీ మొదలయ్యాయని, కెసిఆర్ పాలనలో రైతులు కడుపునిండా తిండి, కంటి నిండా నిద్ర పోయారని బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. గురువారం కెసిఆర్ ఇచ్చిన పిలుపుమేరకు నియోజకవర్గ కేంద్రమైన దుబ్బాకలో స్థానిక బస్టాండ్ వద్ద రైతులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చేందుకు ఉచిత హామీలు ఎన్నో ఇచ్చిందని గుర్తు చేశారు. రైతులకు క్వింటాలకు 500 రూపాయలు బోనస్ ఇస్తామని చెప్పి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట మార్చాలని అన్నారు. నమ్మిన రైతులను నిండా ముంచిన ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమని గుర్తు చేశారు. కెసిఆర్ 10 సంవత్సరాల పాలన లో రైతుల కోసం అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. గతంలో కాంగ్రెస్ పరిపాలన రైతులు ఎలాంటి కష్టాలు పడ్డారో... ఇప్పుడు కూడా అలాంటి కష్టాలే పడతారని అన్నారు. అబద్ధపు హామీలతో అసత్యపు వాగ్దానాలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం రైతులను ఆర్థికంగా దెబ్బతీస్తూ రైతుల నడ్డి విరిచే ప్రయత్నాన్ని చేస్తుందన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు రైతులకు గిట్టుబాటు ధరలను కల్పిస్తూ వరి ధాన్యాన్ని కొనుగోలు చేస్తామని, దానితోపాటు ప్రత్యేకంగా ప్రతి క్వింటాల్ వరి ధాన్యానికి 500 బోనస్ ను ఇస్తామన్న కాంగ్రెస్ పార్టీ దానిని బోగస్ వాగ్దానంగా మార్చి తప్పించుకుంటుందని మండిపడ్డారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత రైతు ఆత్మహత్యలు పెరిగాయన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలో కరువు ఏర్పడిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కరెంటు రాక బోరు మోటర్లు కాలిపోతున్నాయన్నారు. ట్రాన్స్ఫార్మర్లు పేలిపోతున్నాయన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత 24 గంటల కరెంటు ఎనిమిది తొమ్మిది గంటలకు మాత్రమే పరిమితమైందని, అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రంలోని చెరువులు కుంటలు చెక్ డ్యాములు ప్రాజెక్టులు ఎడారులుగా మారాయి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నీళ్లు లేక రైతుల యొక్క పంట పొలాలు ఎండిపోయాయన్నారు. త్రాగునీటి సమస్య ఏర్పడింది అన్నారు. కాంగ్రెస్ వచ్చిన తర్వాత తెలంగాణ రాష్ట్రం యొక్క ఆర్థిక వ్యవస్థ దిగజారింది అన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే మోసపూరిత హామీలు అబద్ధపు వాగ్దానాలు మోసపూరిత కుట్రలు అన్నారు, రైతులు పండించిన ప్రతి గింజను గిట్టుబాటు ధరలను కల్పిస్తూ కొనుగోలు చేయాలన్నారు, సన్న వరి ధాన్యానికి ప్రైవేటు రైస్ మిల్లు వారు 3వేలు పెట్టి సన్నధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నారన్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను పట్టించుకోకపోవడం రైతులకు ఇవ్వాల్సిన బోనస్ ను కూడా ఇవ్వడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణ రాష్ట్రం సాధించిన తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ తెలంగాణ ప్రభుత్వ హయాంలో కాలేశ్వరం లాంటి ప్రాజెక్టులను నిర్మాణం చేసి కొండపోచమ్మ, మల్లన్న సాగర్, రంగనాయక సాగర్ లాంటి ఎన్నో రకాల ప్రాజెక్టుల నిర్మాణం చేసి ఎడారిగా ఉన్న తెలంగాణ రాష్ట్రాన్ని పాడి పంటలతో ఆకుపచ్చ తెలంగాణగా మార్చిన ఘనత కేసిఆర్ ది మాత్రమే అన్నారు. కేసీఆర్ ప్రభుత్వంలో పుష్కలంగా ఎటుచూసిన మిషన్ కాకతీయ ద్వారా 13 వేల చెరువులు నిండుకుండల, ఉన్నాయన్నారు. ప్రాజెక్టుల ద్వారా కెనాల్ ల ద్వారా చెరువులను కుంటలను నింపి మండుటెండల్లో సైతం రైతుల పొలాలకు గోదావరి జలాలను అందించిన ఘనత కేసీఆర్ దే అన్నారు. రైతులకు 24 గంటలు ఉచిత కరెంటు అందించిన ఘనత,రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధరలను కల్పించిన ఘనత, రైతులకు సకాలంలో యూరియా విత్తనాలు అందించిన ఘనత,రైతులకు సకాలంలో ప్రతి ఎకరానికి 10వేలు పెట్టుబడి అందించిన ఘనత, రైతులకు రైతు బీమా కల్పించిన రైతు బీమా కల్పించిన ఘనత గత కేసీఆర్ ప్రభుత్వం హయాంలో రైతులను ఆర్థికంగా బలోపేతం చేసి రైతులను రాజులను చేసిన ఘనత కేసిఆర్ దే, కానీ నేడు కాంగ్రెస్ ప్రభుత్వం రైతులను బిచ్చగాళ్లను చేసిందన్నారు. రైతులను అప్పుల ఊబిలో కూర్కుపోయేటట్టు కాంగ్రెస్ పార్టీ విధానాలు ఉన్నాయన్నారు. రైతు రుణమాఫీ చేయలేదన్నారు, గత కేసీఆర్ ప్రభుత్వంలో రైతుల ఆత్మహత్యలు లేవన్నారు. తెలంగాణ రాష్ట్రం పాడిపంటలతో సుభిక్షంగా ఉందని, సబ్బండ వర్గాలు సుభిక్షంగా ఉన్నాయన్నారు, కాంగ్రెస్ ప్రభుత్వం అబద్ధపు హామీలతో అసత్యపు వాగ్దానాలతో గద్దెనెక్కి ఆరు గ్యారెంటీలను తుంగలో తొక్కిందన్నారు. మహిళా భరోసా లేదన్నారు,రుణమాఫీ చేయలేదన్నారు. మహిళకు 2500 ఇవ్వడం లేదన్నారు, పెన్షన్లు ఇవ్వడం లేదన్నారు, ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.లేని పక్షంలో తెలంగాణ రాష్ట్ర సాధనలో ఎలాంటి ఉద్యమం జరిగిందో మళ్లీ ప్రజల పక్షాన పోరాటం ప్రారంభించడం జరుగుతుందన్నారు.కేసీఆర్ కు ఉద్యమాలు పోరాటాలు కొత్తవి కావన్నారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి రవీందర్ రెడ్డి, సీనియర్ నాయకులు రొట్టె రాజమౌళి, ఎల్లారెడ్డి, కొత్త కిషన్ రెడ్డి, ఆశ స్వామి, నగరం రవి, బాణాల శ్రీనివాస్, పల్లె వంశీ గౌడ్, ఖలీల్, భీమసేన, బూట్ల రాంరెడ్డి, సంజీవరెడ్డి, ఎంగరి రాజిరెడ్డి , సంఘం ప్రభాకర్, ఇస్తారి గల్ల స్వామి, బండి రాజు, సాయిలు, నారా గౌడ్, పడాల నరేష్, భూపాల్ తో పాటు రైతులు, బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# డెంగ్యూ వ్యాధిని తరిమికొడదాం

**- డిఎంహెచ్ వొ డాక్టర్ కోట చలం**

**సూర్యాపేట,మే 16,మన సాక్షి:**

డెంగ్యూ వ్యాధిని తరిమికొడదామని, డెంగ్యూ వ్యాధికి కారణమైన ఎడిస్ దోమ వ్యాప్తి చెందకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కోట చలం అన్నారు. జాతీయ డెంగ్యూ వ్యాధి దినోత్సవం సందర్భంగా గురువారం పాత డిఎంహెచ్ వొ కార్యాలయం వద్ద ఎఎన్ ఎమ్ లతో కలిసి అవగాహన ర్యాలీని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం డ్రై డేగా పాటించాలని, ఇంటి చుట్టుపక్కల పరిసరాలను పరిశుభ్రంగా వుంచుకోవాలని, దోమలు నిల్వ వుండకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన అన్నారు.దోమలు పుట్టకుండా, దోమలు కుట్టకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. పాత కూలర్లు, టైర్లు, ఖాళీ సీసాలలో దోమలు చేరుతాయి కాబట్టి ఇంటి పరిసరాలు పరిశుభ్రంగా వుంచుకోవాలని అన్నారు.ఎడిస్ దోమ పగటిపూట కుడుతుందని, దోమ కుట్టడం వలన అకస్మాత్తుగా తీవ్రమైన జ్వరం రావడం, తలనొప్పి, కండరాల నొప్పి వస్తుందని అన్నారు. వ్యాధి సోకిన వారిని దగ్గరలోని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకుని వెళ్లి వైద్యం అందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాక్సినేషన్ అధికారి డాక్టర్ వెంకటరమణ, డాక్టర్ నాజియ కీటక జనిత వ్యాధుల నివారణ విభాగం, డెమొ అంజయ్య, ఎఎమ్ వొ మోతీలాల్, శాబుద్దిన్, నర్సయ్య, శ్రీనివాస రాజు, ఎఎన్ ఎమ్ లు పాల్గొన్నారు.

# సమాజ మార్పు కోసం పోరాడే వారే కమ్యూనిస్టులు

**అమరుల ఆశయాలు ముందుకు తీసుకెళ్లాలి**

**అంజిరెడ్డి సంతాప సభలో తమ్మినేని పిలుపు**

**నల్లగొండ,మే 16,మన సాక్షి:**



దోపిడీ,అవినీతి రహిత సమాజ నిర్మాణం కోసం నిరంతరం పోరాడే వారే కమ్యూనిస్టులు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నార. గురువారం తిప్పర్తి మండలం ఏ దుప్పలపల్లి ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో సిపిఎం సీనియర్ నాయకులు నన్నూరి అంజిరెడ్డి సంతాప సభ జరిగింది. ఈ సందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ నిరంతరం పేదల హక్కుల కోసం పోరాడిన అంజిరెడ్డి మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటు అని అన్నారు. వారి ఆశయాలు ఆదర్శాలు నేటి యువతరానికి మార్గదర్శకం అని అన్నారు. కమ్యూనిస్టులు ప్రపంచవ్యాప్తంగా ఉన్నారని మానవ సమాజానికి కూడు, గూడు, ఉపాధి, ఉచిత విద్యా, వైద్య సదుపాయాలు అందడం కోసం పనిచేస్తారని గుర్తు చేశారు. రాజకీయాలలోకి బడా కార్పొరేట్ కంపెనీ అధినేతలు చొరబడి కలుషితం చేశారని ఆరోపించారు. ప్రస్తుత సమాజంలో ఉపాధి కరువై కనీస వేతనాలు అందక విద్యా వైద్యం ప్రైవేటు వ్యక్తుల ఉండడంతో సామాన్యులు జీవించలేని పరిస్థితికి ఏర్పడిందని అన్నారు. అందరికీ ఉచిత విద్యా వైద్యం ఉపాధి అవకాశాలు కల్పించగలిగే దోపిడీ రహిత సమసమాజ నిర్మాణం చేయాలని కోరారు. రాజకీయ నాయకులు అవినీతిపరులుగా మారి ప్రజలకు డబ్బు మద్యం కులం మతం ప్రాంతాలు అంటూ రెచ్చగొడుతూ పదవులు పొంది ప్రజలను ధరలు పెంచి ఉపాధి కల్పించకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని అన్నారు తన జీవితకాలం ప్రజా ఉద్యమాల్లో పనిచేస్తూ తన మరణానంతరం వారి పార్టీల దేహాన్ని మెడికల్ విద్యార్థుల వైద్య విద్య కోసం హాస్పిటల్ కు అందజేయడం అభినందనీయమని అన్నారు. సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు చెరుపల్లి సీతారాములు మాట్లాడుతూ కామ్రేడ్ నన్నూరి అంజిరెడ్డి గత 40 సంవత్సరాలుగా రైతు వ్యవసాయ కార్మిక సంఘాలలో పనిచేస్తూ పేదలకు పంచరాయి భూములు పంపిణీ పాలేరులకు సంఘాలు పెట్టి జీతాలు పెంపు కోసం వ్యవసాయ కార్మికుల కూలీరేట్ల పెంపు కోసం అనేక ఉద్యమాలు నిర్మించారని అన్నారు. మానవులు పుట్టడం మరణించడం సహజమని ఈ మధ్యకాలంలో ప్రజల కు సేవచేసి వారి అభిమానాన్ని పొందడమే నిజమైన జీవితమని అది అంజిరెడ్డి ప్రజాభిమానాన్ని పొందాడు అని అన్నారు. తన ఇల్లుని సిపిఎం కార్యాలయంగా మార్చుకుని పేదలకు ఎంతో సేవ చేశారని గుర్తు చేశారు ప్రజా ఉద్యమాల ద్వారా అనేకమంది నీ సిపిఎం కార్యకర్తలుగా వారి కుటుంబ సభ్యులను సిపిఎం పార్టీ నాయకులుగా తీర్చిదిద్దడం ఎంతో అభినందనీయమని అన్నారు వారి ఆశయ సాధన కోసం ప్రతి ఒక్కరూ కంకణబద్ధులు కావాలని పిలుపునిచ్చారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్ రెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సంతాప సభలో సిపిఎం రాష్ట్ర సీనియర్ నాయకులు బొంతల చంద్రారెడ్డి రాష్ట్ర కమిటీ సభ్యులు తుమ్మల వీరారెడ్డి జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు బండా శ్రీశైలం సయ్యద్ హాశిం, పాలడుగు నాగార్జున చిన్నపాక లక్ష్మీనారాయణ పాలడుగు ప్రభావతి సీనియర్ నాయకులు ఊట్కూరి నారాయణరెడ్డి జిల్లా కమిటీ సభ్యులు ఎండి సలీం గంజి మురళీధర్ దండెంపల్లి సత్తయ్య తుమ్మల పద్మ మండల కార్యదర్శి మన్నెం బిక్షం కుటుంబ సభ్యులు నన్నూరి వెంకటరమణారెడ్డి, కీర్తి, మందడి సువర్ణ, నన్నూరి కౌసల్యమ్మ, సిపిఎం తిప్పర్తి మండల నాయకులు బిరెడ్డి సీతారాం రెడ్డి భీమగాని గణేష్ ఆకిటి లింగయ్య శశిధర్ చెనగోని వెంకన్న జంజరాల ఉమా యం.డి లతీఫ్ గండమళ్ళ రాములు దొంగరి వెంకన్న భీమగాని శ్రీనివాసులు మైల సైదులు వంగల యాదగిరి రెడ్డి శివలింగం అశోక్ రెడ్డి గంజి రాములు శ్రీనివాస్ రెడ్డి గండమల్ల యాదగిరి సంజీవరెడ్డి కోట్ల గోవర్ధన్ రెడ్డి దామోదర్ రెడ్డి నల్పరాజు యాదయ్య శంకర్ శరత్ బిక్షం శ్రీను లింగయ్య బ్రహ్మాచారి శంకరాచారి తదితరులు పాల్గొన్నారు.

# సాయిబాబా గుడిలో తీన్మార్ మల్లన్న ప్రత్యేక పూజలు

**చింతపల్లి,మే 16,మన సాక్షి:**



నల్గొండ,వరంగల్, ఖమ్మం, జిల్లాల పట్టభద్రుల ఉప ఎన్నికల ఎమ్మెల్సీ కార్యక్రమ నిర్వహణలో భాగంగా దేవరకొండ పట్టణంలోని ఫంక్షన్ హాల్లో జరుగుతున్న పట్టభద్రుల ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్సీ అభ్యర్థి తీన్మార్ మల్లన్న వెళ్తున్న సందర్భంగా చింతపల్లి మండల కేంద్రంలోని స్థానిక సాయిబాబా మందిరంలో దైవ దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మంచి కంటి ధనంజయ వారిని సాదరంగా ఆహ్వానించి తీన్మార్ మల్లన్నకు ఆలయ పూజారులతో బాబా ప్రత్యేక ఆశీర్వాచనాలు అందజేశా రు. ఈ సందర్భంగా తీన్మార్ మల్లన్న నూ వారి వెంట విచ్చేసిన బృందాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా భక్తులను యువకులను ఉద్దేశించి తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ నేటి సమాజంలో ప్రతి ఒక్కరు దైవచింతన అలవర్చు కొని ముందుకు వెళ్లాలని వారు సూచించారు. మానవ సేవయే మాధవ సేవగా భావించి దేవాలయం తరపున ఆలయ కమిటీ నిర్వాహకులు ఎన్నో కార్యక్రమాలు చేపట్టడం హర్షించదగ్గ విషయం అన్నారు. దేవరకొండ నియోజకవర్గం పరిధిలోని చింతపల్లి మండలంలో ఇలాంటి ప్రశాంతమైన దేవాలయం నల్లగొండ జిల్లాలోని ఈ ప్రాంతంలో నెలకొల్పడం మన అందరి అదృష్టమన్నారు. షిరిడి తర్వాత ఇంత అద్భుతమైన దేవాలయాన్ని నిర్మాణం చేపట్టిన ఆలయ కమిటీ చైర్మన్ మంచి కమిటీ ధనంజయకు కమిటీ నిర్వాహకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. అదేవిధంగా పశువుల గోశాలను కూడా ఎంతో అద్భుతంగా ఏర్పాటుచేసి నిర్వహణ చేపట్టడం ఈ ప్రాంత ప్రజలు చేసుకున్న పుణ్యం అన్నారు. తాను శిరిడి సాయిబాబా దైవ కృపతో మీ ముందుకు వచ్చి చట్ట సభల్లో ప్రశ్నించేందుకు ఈనెల 27న జరిగే నల్లగొండ, వరంగల్, ఖమ్మం, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా కాంగ్రెస్ పార్టీ తనకు ఈ అవకాశాన్ని కల్పించిందన్నారు. అందుకోసం ప్రతి ఒక్క పట్టభద్రులైన యువతీ యువకులు మీ అమూల్యమైన ఓటును తనకుకు వేసి చట్టసభకు పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంగిరేకుల నాగభూషణం ,నాయకులు ముచ్చర్ల యాదగిరి, పి ఎస్ ఎస్ చైర్మన్ లింగంపల్లి వెంకటయ్య, కాసారం శ్రీనివాస్, గోవింద్ యాదగిరి , రవి, సదానందం, ఆలయ కమిటీ సభ్యులు కోశాధికారి ఊరే కృష్ణయ్య, ప్రధాన కార్యదర్శి కొమిరిశెట్టి వెంకటయ్య, కుంభం పుల్లారెడ్డి, తడకమళ్ళ శ్రీనివాస్, ఆలయ పూజారులు, తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పాలన పై కన్నెర్ర

**గుండె మండి రోడ్డెక్కిన అన్నదాతలు**

**తడిసిన ధాన్యం కొనుగోలు చేయాలని డిమాండ్**

**రైతులకు మద్దతుగా మిర్యాలగూడలో బిఆర్ఎస్ శ్రేణుల నిరసనలు**

**రైతాంగానికి భరోసా కల్పించే దిశగా పోరాటం అనిర్వచనీయం**

**తిప్పన విజయసింహా రెడ్డి**





**మిర్యాలగూడ టౌన్, మే 16, మన సాక్షి:**

వ్యవసాయానికి కరెంటు,నీళ్లు ఇవ్వకుండా అన్నదాతను ఏడిపించిన కాంగ్రెస్ ప్రభుత్వం పండించిన వడ్లు కొనకుండా గోస పెడుతుందని టీఎస్ ఆగ్రోస్ మాజీ చైర్మన్ తిప్పన విజయసింహా రెడ్డి ఆరోపించారు. కొనుగోలు కేంద్రాల్లో వడ్ల బస్తాలు పేరుకుపోయి, వానకు తడుస్తుంటే పట్టించుకోని సర్కారు తీరు చూసి గుండెమండిన అన్నదాతలు రోడ్డెక్కి ఆందోళనలు చేసే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఈ నేపథ్యంలో రైతులను గోసపుచ్చుకుంటున్న సర్కారు తీరుకు వ్యతిరేకంగా నిరసనలకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పిలుపునిచ్చారు. గురువారం అన్ని అసెంబ్లీ నియోజకవర్గ కేంద్రాల్లో నిరసన కార్యక్రమాలు చేపట్టాలంటూ గులాబీ సైనికులకు పిలుపునిచ్చారు. రైతుల పక్షాన నిలబడాలని బీఆర్ఎస్ శ్రేణులను కోరారు. రైతాంగానికి భరోసా కల్పించే దిశగా నిరసన కార్యక్రమాలతోపాటు ప్రతిరోజూ వడ్ల కల్లాల వద్దకు వెళ్లి రైతులకు అండగా నిలవాలని సూచించారు. రైతుల హక్కులను కాపాడేందుకు, వారికి అండగా నిలిచేందుకు బిఆర్ఎస్ ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటుందని కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ నేపథ్యంలో మిర్యాలగూడ మాజీ శాసనసభ్యులు నల్లమోతు భాస్కర్ రావు పిలుపు మేరకు నియోజకవర్గ స్థాయి బిఆర్ఎస్ శ్రేణులు నిరసన ప్రదర్శనలు చేపట్టారు. మిర్యాలగూడ పట్టణంలో సాగర్ రోడ్డులోని మహాత్మాగాంధీ విగ్రహానికి తిప్పన విజయసింహా రెడ్డి నేతృత్వంలో బిఆర్ఎస్ నేతలు,కార్యకర్తలు వినతి పత్రం అందజేశారు. అనంతరం రెడ్డి కాలనీలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో తిప్పన విజయసింహా రెడ్డి మాట్లాడారు. రైతాంగానికి భరోసా కల్పించే దిశగా నల్లమోతు భాస్కర్ రావు పోరాటం అనిర్వచనీయమని కొనియాడారు. లోక్‌సభ ఎన్నికలు ముగియగానే బోనస్‌పై నాలుక మర్లేసిన కాంగ్రెస్ తీరుపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలింగ్ ముగిసిన తెల్లారే వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఇప్పుడు సన్నవడ్లకే బోనస్ ఇస్తామని చేసిన ప్రకటనపై తీవ్రస్థాయిలో మండిపడ్డారు. కాంగ్రెస్ రైతు వ్యతిరేక విధానాలను ఖండిస్తున్నట్టు చెప్పారు. రైతుల పక్షాన నిలబడే పార్టీ బీఆర్ఎస్ ఒక్కటేనని తిప్పన విజయసింహా రెడ్డి స్పష్టం చేశారు. తెలంగాణ రాష్ట్రంలో 90 శాతం రైతులు దొడ్డు వడ్లనే పండిస్తారు. ఈ విషయం తెలిసి కూడా రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రకటన పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సన్న వడ్లకు మాత్రమే బోనస్ ఇస్తామనడం ద్వారా తెలంగాణ రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి వంచించిందన్నారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ జిల్లా డీసీఎంస్ చైర్మన్ దుర్గంపూడి నారాయణ రెడ్డి, దామరచర్ల జడ్పీటీసీ అంగోతు లలిత హాతీరాం, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు పెండ్యాల పద్మ, వైస్ ఎంపీపీ అమరావతి సైదులు, వ్యవసాయ మార్కెట్ మాజీ చైర్మన్ చిట్టిబాబు నాయక్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్ యడవెల్లి శ్రీనివాస్ రెడ్డి, కో-ఆప్షన్ సభ్యులు మోసిన్ అలీ, మండల పార్టీ అధ్యక్షులు పాలుట్ల బాబయ్య, నామిరెడ్డి కరుణాకర్ రెడ్డి, పాక్స్ మాజీ చైర్మన్ వెలిశెట్టి రామకృష్ణ, బీఆర్ఎస్ నాయకులు అబ్దుల్ కరీం, పునాటి లక్ష్మీ నారాయణ, తలకోన శ్రీధర్ రెడ్డి, సాధినేని శ్రీనివాస్, చాంద్ పాషా, మన్నెం శ్రీనివాస్ రెడ్డి, పశ్య శ్రీనివాస్ రెడ్డి, అంజన్ రాజు, గుడిసె దుర్గా ప్రసాద్, ఘంట శ్రవణ్ రెడ్డి, కార్మిక విభాగ అధ్యక్షులు అంజయ్య, కోదాటి రమా, పట్టణ వార్డు అధ్యక్ష, కార్యదర్శులు, ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్లు, బిఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



# ఎమ్మెల్యేగా నిసార్ అహ్మద్ గెలుపు తథ్యం

**రామసముద్రం,మే 16,మన సాక్షి:**

నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డిని గురువారం పార్టీ కార్యాలయంలో మండల వైసీపీ నాయకులు పుష్పగుచ్ఛం అందజేసి మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ గెలుపు కోసం ప్రతి వైసీపీ మండల నాయకులు కష్టపడ్డారని అన్నారు. నిసార్ అహ్మద్ గెలుపు తద్యం అని ప్రభుత్వఏర్పాటు ఖాయమని ఆయన దీమా వ్యక్తం చేశారు. కలిసిన వారు ఎంపిపి కుసుమకుమారి, పాలాభత్తుల సుబ్రహ్మణ్యం, మహబూబ్ బాషా, సచివాలయం బాస్కర్, వెంకటస్వామి,బాబా, జబీ మెకానిక్ వెంకటేష్,రహంతుల్లా నరసింహులు శేషు,తదితరులు పాల్గొన్నారు.

# మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డిని కలిసిన మస్తాన్

**రామసముద్రం,మే 16,మన సాక్షి:**



మాజీ ఎమ్మెల్యే దేశాయ్ తిప్పారెడ్డి ని గురువారం పార్టీ కార్యాలయంలో ఉప సర్పంచ్ టపాలమస్తాన్ పుష్పగుచ్ఛం అందజేసి మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ ఎమ్మెల్యే తిప్పారెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే అభ్యర్థి నిసార్ అహ్మద్ గెలుపు కోసం వైసీపీ మండల నాయకులు కార్యకర్తలు ఎండ అనక వాన అనకు ఇల్లు ఇల్లు తిరిగి గెలుపు కోసం కష్టపడ్డారన్నారు. నిసార్ అహ్మద్ గెలుపు తద్యం అని ప్రభుత్వ ఏర్పాటు ఖాయమని ఆయన దీమా వ్యక్తం చేశారు. కలిసిన వారు, ఉప సర్పంచ్ మస్తాన్ చింతలమంజు, రెడ్డివారి హరి, మదన్ తదితరులు కలిశారు

# ఘనంగా శ్రీ సాయి దత్త ఆశ్రమ నాగసాయి వార్షికోత్సవం



**మిర్యాలగూడ టౌన్, మే 16, మన సాక్షి:**

మిర్యాలగూడ రైల్వే కాలనీ శ్రీ సాయి దత్త ఆశ్రమంలో శ్రీ నాగ సాయి విగ్రహ ప్రతిష్ట 14వ వార్షికోత్సవ వేడుకలు గురువారం కన్నడ పండుగగా నిర్వహించారు. తెల్లవారుజామున శ్రీ పంచా మృతములు పళ్ళ రసాలతో అభిషేకాలు చేశారు. అనంతరం ఆలయ ప్రధాన కార్యదర్శి నరేందర్ ఆధ్వర్యంలో 21 కిలోల పూలతో సాయి నాధుడికి ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం మధ్యాహ్నం శ్రీ సాయినాధుడికి పల్లకి ఉత్సవం మేళ తాళాల నడుమ ఘనంగా నిర్వహించారు. పట్టణం పరిసర ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున దంపతులు పాల్గొని పూజలు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. ఆలయ అధ్యక్ష కార్యదర్శులు గుండ శ్రీనివాస్, గుడుగుంట నరేందర్, మట్టయ్య, సోమన్న,పందిరి సత్యనారాయణ, జగన్నాధ రావు జానకి రాముడు,రవి కిరణ, విక్రం,వెంకన్న అంజిబాబు, అరుణ,భాగ్యలక్ష్మి పద్మ, కళ్యాణి, భవాని శారద తదితరులు పాల్గొన్నారు.

# ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శిగా కాశి ఎన్నిక

**- జిల్లా ఇంచార్జ్ వరికుప్పల వెంకన్న**

**మిర్యాలగూడ టౌన్, మే 16, మన సాక్షి:**




ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శిగా పోతుగంటి కాశీని ప్రకటిస్తున్నట్టు జిల్లా ఇన్చార్జి వరికుప్పుల వెంకన్న తెలిపారు. పార్టీ నిర్మాణం ప్రజాసంఘాల బాధ్యతలు పార్టీ భవిష్యత్తు కోసం బాధ్యతలు నిర్వహించాలని పేర్కొన్నారు. గురువారం యాద్గార్ పల్లిలో ఉమ్మడి నల్గొండ జిల్లా ఎంసిపిఐయు సమావేశం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికల్లో ఎంసిపిఐయు పార్టీ అభ్యర్థి వస్కుల మట్టయ్య గెలుపు కోసం అహర్నిశలు కృషి చేసిన జిల్లా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నిర్మాణం భవిష్యత్ కార్యాచరణ కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలని కోరారు. ఈనెల 24, 25 తేదీల్లో ఎంసిపిఐయు క్లాసులను యాద్గార్ పల్లిలో నిర్వహిస్తున్నామని,క్లాసులు విజయవంతం చేయడానికి కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మట్టయ్య, సూర్యాపేట జిల్లా కార్యదర్శి ఎస్.కె నజీర్, నల్గొండ జిల్లా కార్యదర్శి సైదమ్మ, చంద్రకళ, కిరణ్, భరత్, పాల్గొన్నారు.

# ఉచిత మెగా వైద్య శిబిరం

**మాడుగులపల్లి,మే 16,మన సాక్షి:**




ఆశ్రయం హ్యాండ్ ఆఫ్ హెూప్ వారి ద్వారా ఇమ్మానుయేలు మెమోరియల్ ట్రస్ట్ పాములపహాడ్ వారి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ వైద్య శిబిరంలో 500 మందికి ఉచితంగా ఎటువంటి డాక్టర్ కన్సల్టేషన్ ఫీజు లేకుండా రక్త పరీక్షలు బిపి షుగర్ కంటి పరీక్షలు అద్దాలు పంపిణీ చేయడం జరిగింది. ఎక్సరే మరియు ఈసీజీ, పంటి పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది డాక్టర్స్ జితేంద్ర ప్రమోద్ సంధ్యారాణి మనోజ్ఞ వికాస్ మరియు ల్యాబ్ టెక్నీషియన్స్ క్యాంప్ మేనేజర్ జంగా జయరాజ్ సమూయేలు సొలోమోన్ స్వామి జానకిరామ్ సన మరియు జవాజి ఆనంద్ కుమార్ జవ్వాజి జెస్సి కుమార్ మల్లెపాక తిమోతి కుర్రి దేవరాజు ప్రసన్న కుమార్ తదితరులు పాల్గొన్నారు.

Edited, Printed, Published and Owned by MALLE NAGI REDDY Printed at LAXMI PUBLICATIONS H.No. 28-891/9, Journalist Colony, Chinthapally X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana.and Published at H.no.. 28 - 891/9, Chinthapally Bypass X Road, Miryalagda, Dist: Nalgonda-508207, Telangana."Editor: MALLE NAGI REDDY. RNI NO. TELTEL/2022/83470. Cell: 9666924232. gmail Id: manasakshi.in@gmail.com.